విలేకరులు కావలెను
TELANGANA VANI TELUGU DAILY R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143



TELANGANA VANI TELUGU DAILY

R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక



తెలంగాణ వాణి
20 వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
తెలంగాణ వాణి కుటుంబ సభ్యులకు 20వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
తెలంగాణ వాణి పత్రికేయ కుటుంబ సభ్యులు, పాఠకులు, ప్రకటనకర్తలు, ప్రజా ప్రతినిధులు, అధికారులకు శుభాకాంక్షలు

ఎడిటర్
జేరిపోతుల సంపత్
9912758107



సంపుటి: 16 | సంచిక : 76 | శుక్రవారం 10. 7. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00




## పరిశ్రమలన్నీ ఓఆర్ఆర్ బయటికి తరలిస్తాం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్‌లో నెలకొల్పిన 5.6 గిగావాట్ల సామర్థ్యం కలిసిన సోలార్ మాడ్యూల్ తయారీ
- ప్రిమియర్ ఎనర్జీ రూపొందించిన మొట్టమొదటి సోలార్ ఆక్సీ ట్రీ -- సోలార్ పవర్డ్ స్ట్రీట్ లైట్,
- యూనిట్‌ను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభం

### తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ తెలంగాణ వాణి)

2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్స్ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. షాబాద్ మండలం సీతారాంపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియాస్ నెక్ట్స్- జెన్ సోలార్ మాడ్యూల్ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. " యువతలో నైపుణ్యాభివృద్ధి కోసమే.. స్కిల్స్ యూనివర్సిటీ నెలకొల్పాం. ఏటా 1.10 లక్షల మంది యువత ఇంజినీరింగ్ పట్టాలతో బయటకి వస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరిశ్రమలు రావాలి. బ్లూకాలర్ ఎంప్లాయిస్‌లో కొత్త స్కిల్స్ పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. సీతారాంపురం ప్రజల త్యాగాల వల్లే ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. గతంలోనూ రంగారెడ్డి జిల్లా ప్రజల త్యాగాల వల్లే ఓఆర్ఆర్, పరిశ్రమలు వచ్చాయి. అత్యంత నివాస అనుకూల నగరాల జాబితాలో హైదరాబాద్ ముందుంటుంది. అయినప్పటికీ హైదరాబాద్‌ను కూడా కాలుష్య సమస్య వేధిస్తోంది. 1.34 కోట్ల మంది ఓఆర్ఆర్ లోపల నివసిస్తున్నారు. ఓఆర్ఆర్ లోపలున్న పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలకు తరలించాలని నిర్ణయించాం. పెరి అర్బన్ రీజియన్‌లో ప్రత్యేక మాన్యుఫ్యాక్చరింగ్ జోన్లు ఏర్పాటుచేస్తున్నాం.



### మూసీ ప్రాజెక్టు మొదటి దశకు ప్రభుత్వం అనుమతి..

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు మొదటి దశకు అనుమతిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రూ.7,345 కోట్లతో జోన్-1 పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రూ.4,500 కోట్ల ఏడీబీ రుణంతో మూసీ రివర్ ఫ్రంట్ బోర్డు ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. రూ.2,845 కోట్లు హెచ్‌ఎండీఏ లేదా టీజీఐఐసీ నుంచి రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జోన్-1ఏలో హిమాయత్‌సాగర్-బాపూఘాట్ వరకు రూ.3,104 కోట్లతో 9.20 కి.మీ అభివృద్ధి చేయనున్నారు. జోన్-1బీలో ఉస్మాన్ సాగర్-బాపూఘాట్ వరకు రూ.3,950 కోట్లతో 11.80 కి.మీ అభివృద్ధి చేయనున్నారు. ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ నియామకానికి ఎంఆర్‌డీసీఎల్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.



## పశ్చిమాసియా మరోసారి దద్దరిల్లుతోంది..

హైదరాబాద్ తెలంగాణ వాణి)

- దేశ ప్రధాని నరేంద్ర మోడీ
- అన్ని ఘర్షణలు దౌత్యం, చర్చలు ద్వారానే పరిష్కారం
- మూడుదేశాల పర్యటనలో భాగంగా ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న మోదీ..
- ఆ దేశ ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌తో కలిసి ఇండియా -ఆస్ట్రేలియా సీఈఓ ఫోరమ్‌లో ప్రసంగం
- స్వచ్ఛ ఇంధనాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో కీలకమైన అణుశక్తి ఒప్పందం

## నా కంఠంలో ప్రాణముండగా మళ్లీ బీఆర్ఎస్‌కు వెళ్లను

- తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత
- బీఆర్ఎస్ పార్టీ ఖాతాలోని రూ.1,400 కోట్లు అమరుల కుటుంబాలకు పంచాలి
- ఆ డబ్బు క్విడ్ ప్రోకో ద్వారా వచ్చింది కాదా?
- బాయిబాట కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెంలో కవిత
- "మా పార్టీతో భయం లేదంటూనే ఈసీకి వెయ్యికి పైగా ఫిర్యాదులు
- టీఆర్ఎస్ పేరు నాకు రాకుండా కుట్రలు చేస్తున్నారు.



## బండి భగీరథ్‌కు బెయిల్

- కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌కు ఊరట
- పోక్సో కేసులో అతడికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు
- షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం..
- దర్యాప్తునకు సహకరించాలని బండి భగీరథ్‌ను ఆదేశం



## మొలకెత్తని సోయా.. ధర్నాకు దిగిన రైతులు..!

- కలెక్టర్ తిరిగి వెళ్లే సమయంలో రైతులు ధర్నా
- రైతుల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్
- విత్తనాల స్థానంలో నగదు రూపంలోనే పరిహారం అందించాలని డిమాండ్



## జూలై 11న యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం

- తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో వైభవంగా కార్యక్రమం
- ఇప్పటికే దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి
- ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా ఎంఎస్ఎన్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ మన్నె సత్యనారాయణ రెడ్డి ప్రమాణ స్వీకారం
- ఆయనతో పాటు మొత్తం 18 మంది సభ్యులు బాధ్యతలు స్వీకరణ



## సంక్షేమ పథకాలు చివరి లబ్ధిదారుని వరకు చేరాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చివరి లబ్ధిదారుని వరకు చేరాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. గురువారం హన్మకొండ జిల్లా పర్యటన సందర్భంగా కలెక్టరేట్ లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం, ప్రజా చైతన్యానికి సంబంధించిన సానుకూల అంశాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా బాధ్యత ఎంతో కీలకమని అన్నారు. ప్రజల్లో బాధ్యత, సామాజిక చైతన్యం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన పెంచేందుకు మీడియా నిరంతరం కృషి చేయాలని కోరారు. డ్రగ్స్ నిర్మూలనను ప్రజా ఉద్యమంగా మార్చడంలో మీడియా కీలక భాగస్వామిగా ఉండాలన్నారు. ప్రభుత్వం, ప్రజలు, మీడియా సమిష్టిగా కృషి చేసినప్పుడే డ్రగ్స్ రహిత భారత్ -- డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యం సాకారమవుతుందని గవర్నర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పాల్గొన్నారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీనే వేతనాలు

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఉపశమనం కలిగించింది. శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాలలో విధులను నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీనే వేతనాలు విడుదల చేయాలన్న విజ్ఞప్తిపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. సీఎం ఆదేశాల మేరకు.. వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలలో పనిచేస్తున్న ప్రభుత్వ, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది అందరికీ ప్రతినెలా ఒకటో తేదీ నాడే వేతనాలు అందేలా తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు.

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



హైదరాబాద్ తెలంగాణ వాణి)

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సాగునీరు
- వ్యవసాయ యాంత్రీకరణకు వేల కోట్ల రూపాయలు ఖర్చు
- ధాన్యం కొనుగోళ్ళు కోసం ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను ఖర్చు
- మాది చేతల ప్రభుత్వం కాబట్టి నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్ట్ ల నుంచి నీళ్లు
- తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్లు
- బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరం ఒక్కటే.
- దశాబ్దాల కిందట కాంగ్రెస్ పార్టీ కట్టిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి.
- కాంగ్రెస్ పార్టీ చేతల పనులకు వ్యత్యాసం నేడు ప్రజలందరికీ తెలుసు
- పూర్తిగా వ్యవసాయం మీద ఆధారపడిన మన జిల్లాలను సస్యశ్యామలం
- రైతు భరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే తొమ్మిది వేల కోట్లు రైతుల అకౌంట్లో నేరుగా జమ
- ఎన్ని సమస్యలున్నా ప్రజా ప్రభుత్వం ఇక్కడ పండించిన ధాన్యాన్ని కొనుగోలు

## బీఆర్ఎస్ గెలిచే నియోజకవర్గాలపై కేటీఆర్ ప్రిడిక్షన్..

- బీఆర్ఎస్ దే విజయమని కేటీఆర్ జోస్యం
- గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ నేతలతో నిర్వహించిన సమావేశం
- రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి తన పరిపాలనపై ఆగ్రహం
- సీఎం సర్వేలో కాంగ్రెస్ పై ప్రజా వ్యతిరేకత స్పష్టంగా వ్యక్తమయింది
- ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ 78 సీట్లు గెలుస్తుంది
- మీడియా, ఇంటెలిజెన్స్ విభాగాల ప్రజాభిప్రాయ సేకరణలో కూడా ఇదే విషయం స్పష్టం
- రాష్ట్ర ప్రజలంతా కేసీఆర్ ను మరోసారి సీఎంగా చూడాలనుకుంటున్నారు





## బీబీనగర్ ఎయిమ్స్ దేశంలోనే అత్యుత్తమ వైద్య కేంద్రంగా ఎదుగుతుంది

- కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా
- బీబీనగర్ ఎయిమ్స్‌లో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, కిషన్ రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, లక్ష్మణ్, ఎయిమ్స్ అధికారులతో సమీక్ష సమావేశం
- బీబీనగర్ ఎయిమ్స్ నిర్మాణం రూ.1,000 కోట్ల వ్యయంతో కొనసాగుతోంది
- ఇప్పటివరకు 87 శాతం పనులు పూర్తి



## మహారాష్ట్ర మహిళా కూలీలతో ముచ్చటించిన హరీష్ రావు...

కూలీ డబ్బులు ఎలా మిగులుతున్నాయని, మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు గురువారం మహారాష్ట్ర నుంచి వచ్చి నాట్లు వేసే మహిళా కూలీలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహారాష్ట్ర చంద్రపూర్ జిల్లా నుండి ఇక్కడికి వచ్చి నాట్లు వేస్తే ఎంత లాభం మిగులుతుందని మహిళలను అడిగి తెలుసుకున్నారు.

## హరీష్ రావు మీద కేసీఆర్‌కు నమ్మకం లేదు

- రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్
- సాగునీటి రంగంలో హరీష్ రావు పెద్ద నిష్ణాతుడైనట్లు మాట్లాడుతున్నారు
- "ఇరిగేషన్లో హరీష్ రావు అంత నిష్ణాతుడే అయితే, గత ప్రభుత్వంలో ఆయన మామ కేసీఆర్ ఆ శాఖ నుంచి ఎందుకు తొలగించారు?



# సంపాదకీయం

## అంతా కల్తీ మయమే

భారతదేశంలో ఆహార కల్తీ రక్కసి కోరలు చాస్తున్నది. యేటా దేశవ్యాప్తంగా కల్తీ ఆహారం కారణంగా సుమా రు 70 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నారనే చేదు నిజాన్ని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) నివేదిక ప్రకారం.. భారత్ లో యేటా 10 కోట్ల మంది కల్తీ ఆహారం తీసుకుని అనారోగ్యానికి గురవుతున్నారు. ఇందులో 20 శాతం మంది ఆసుపత్రుల పాలవుతున్నారు. ఫలితంగా నిల్వ ఉంచిన కలుషిత ఆహారం కొనుక్కుని తిని మరీ ప్రజలు రోగాలను కొని తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఈ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఆహార భద్రతా ప్రమాణాల అమలులో తెలంగాణ విఫలమనే చెప్పవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో పాల కల్తీ నిరంతరాయంగా సాగుతున్న ఒక ప్రమాదకర వ్యాపారంగా మారింది. పసి పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి రోజూ వినియోగించే పాలు ఇప్పుడు విషపూరిత రసాయనాలతో నిండిపోతున్నాయి. పాల సాంద్రత పెంచేందుకు గంజి పొడిని వాడుతున్నారు. వంటగదిలో నిత్యం వినియోగించే పదార్థాలు, మసాలాలన్నీ ఇప్పుడు కల్తీ కాటుకు గురవుతున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తో పాటు ప్రధాన పట్టణాల్లో తరచూ 'కల్తీ'కారుల అక్రమాలు వెలుగు చూడటం ఆందోళన కలిగిస్తున్నది. ఇటీవల హైదరాబాద్, మైలార్దేవపల్లి, లాలాగూడల్లో అపరిశుభ్ర వాతావరణంలో తయారవుతున్న కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ కేంద్రాలపై పోలీసులు జరిపిన దాడులు ఒక ఎత్తయితే, కేవలం అల్లం వెల్లుల్లి, నెయ్యి మాత్రమే కాదు.. మనం నిత్య ఇంట్లో వినియోగించే పాలు, కారం, నూనె నుంచి టీ పొడి చివరకు.. ప్రతీది నకిలీమయం అవుతుండటం ఆందోళనకరం. శంషాబాద్ జోన్ పరిధిలోని జల్పల్లి, పహాడీషరీఫ్ ప్రాంతాల్లో పట్టుబడిన కల్తీ పదార్థాల తయారీ కేంద్రాలను పరిశీలిస్తే, ఆహార భద్రత ప్రమాణాలను గాలికొదిలేసి, లాభార్జనే ధ్యేయంగా దందా సాగినట్లు స్పష్టమ వుతున్నది. కల్తీల వెనుక వాస్తవాలు అత్యంత దారుణంగా ఉన్నాయి. అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీలో అక్రమార్కులు కుళ్లిన అల్లం, తక్కువ నాణ్యత గల వెల్లుల్లికి తోడు.. జిగురు కోసం ప్రమాదకరమైన 'ఎక్సజన్ గమ్ పౌడర్', రంగు కోసం సింథటిక్ రసాయనాలు, నిల్వ ఉండటానికి అధిక మోతాదులో సిట్రిక్ యాసిడ్ వాడినట్లు అధికారులు గుర్తించారు. ఈ పదార్థాలు మనిషి శరీరంలోకి వెళితే జీర్ణకోశ వ్యాధుల నుంచి మొదలుకొని దీర్ఘకాలంలో క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉంది. కల్తీ నెయ్యి విషయానికొస్తే, అక్రమార్కులు తక్కువ ధరకు లభించే పామాయిల్, డాల్డా, హైడ్రోజనేటెడ్ వెజిటబుల్ ఫ్యాట్స్ను ఆవు, గేదె పాల మీగడలో కలిపి తమదే స్వచ్ఛమైన నెయ్యి అని మార్కెట్లోకి వదులుతున్నారు. పాలను చిక్కగా మార్చేందుకు వీరు యూరియా, డిటర్జెంట్ పొడి, గ్లూకోజ్, స్టార్చ్ పౌడర్లు వాడుతున్నట్లు తేలింది. ఈ నెయ్యిని వినియోగిస్తే కాలేయం దెబ్బతినడం, మూత్రపిండాల వైఫల్యం, గుండె సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు ఈ కల్తీ మహమ్మారి ఇంతలా వేళ్లూనుకోవడానికి మారుతున్న జీవనశైలే ప్రధాన కారణమని విశ్లేషకులు చెప్తున్నారు. ఆధునిక కాలంలో 'ఇన్స్టంట్ ఫుడ్'పై మోజు, ఏ వంట అయి నా త్వరగా సిద్ధమైపోవాలనే ఆతృత.. కల్తీ కేటుగాళ్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఇంట్లో అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేసుకునే ఓపిక లేకపోవడం, ఆన్లైన్ ఫుడ్ డెలివరీ యాప్స్ ద్వారా వచ్చే ఆకర్షణీయమైన ఆఫర్ల వెంట పడటం వల్ల మనం తెలియకుండానే విషాన్ని కొని తెచ్చుకుంటున్నాం తక్కువ ధరకే దొరుకుతున్నాయని నాణ్యతను పట్టించుకోకుండా రోడ్డు పక్కన విక్రయించే విడి అల్లం పేస్టు, లోకల్ బ్రాండ్ నెయ్యి ప్యాకెట్లను ఆశ్రయించడం ప్రాణాంతకం. హోటళ్లు, ఫంక్షన్ హాళ్లలో లాభాల కోసం ఇలాంటి కల్తీ ఉత్పత్తులనే వాడుతున్నట్లు యంత్రాంగం విచారణలో తేలడం గమనార్హం. కేవలం పోలీసుల దాడులు, అరెస్టులతోనే ఈ వ్యవస్థ ప్రక్షాళన కాదు. వినియోగదారులు కూడా అప్రమత్తంగా ఉండాలిసాధ్యమైనంత వరకూ ఇంట్లో తయారు చేసుకునే పదార్థాలనే, వినియోగించుకోవడం ఉత్తమం. అధిక లాభాల కోసం సామాన్యుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ ముఠాలపై ప్రభుత్వాలు కఠిన చట్టాలను ప్రయోగించి, కల్తీ మహమ్మారికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాలు తెల్లగా కనిపించేందుకు అక్రమార్కులు వైట్ పెయింట్ ను ఉపయోగిస్తున్నారు. నిల్వ ఉంచేందుకు ఫార్మాలిన్ వంటి రసాయనాలను వాడుతున్నారు. కేవలం లాభాపేక్షే ధ్యేయంగా నకిలీ పాల రైతులు అవతారమెత్తి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఒక పాడి గేదె పెంపకం దారు వద్ద రెండు మూడు గేదె లు ఉంటే 20 నుంచి 30 మంది వినియోగదారులు ఉంటున్నారు. ఈ అదనపు పాలు ఎక్కడ నుంచి వస్తున్నాయో దేవుడికే తెలియాలి. బజారుకొకటి ఉంటున్న ప్రైవేట్ పాల కేంద్రాలు కొన్ల కొద్దీ పాలను విక్రయిస్తున్నాయి. ఈ కేంద్రాల్లో యూరియా బస్తాల నిల్వలు కనిపిస్తున్నాయి. పంటలకు దొరకని యూరియా ఇక్కడ నిల్వ ఉండటం వెనుక అసలు పరమార్థం ఇదే. కల్తీ కోసం అక్రమార్కులు యూరియా, ఫార్మాలిన్, డిటర్జెంట్లు, అమ్మోనియం సల్ఫేట్, కాస్టిక్ సోడా వంటి భయంకరమైన రసాయనాలను ఉపయోగిస్తున్నారు. పాల సాంద్రతను పెంచేందుకు గంజి పొడిని కలుపుతున్నారు. నీళ్లు కలిపిన పాలు చిక్కగా కని పించేందుకు సబ్బును ఉపయోగిస్తున్నారు. వైట్ పెయింట్ ని పాలలో కలపడం కల్తీ దారుల మితిమీరిన తెలివికి నిదర్శనం, వీటివల్ల మూత్రపిండాల వ్యాధులు, క్యాన్సర్, జీర్ణకోశ సమస్యలు తలెత్తుతున్నాయి. ఫార్మాలిన్ రసాయనం కాలేయం, మూత్రపిండాలపై హానికరమైన ప్రభావాన్ని చూపుతుంది. పాలలో లాక్టోమీటర్ పరీక్షలతో కూడా గుర్తించలేని విధంగా కార్బోహైడ్రేట్లు కలుపుతున్నారు. ఇంతటి ప్రమాదకర స్థితి నుంచి ప్రజలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆహార భద్రతా శాఖతో తరచూ ఆకస్మిక దాడులు నిర్వహించి కల్తీకి పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి. లేనిపక్షంలో సామాన్య ప్రజలు రోగాలపాలై అర్ధాంతరపు చావులకు గురికాక తప్పదు.

## తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీని కలిసిన ప్రవీణ్ కుమార్ యాదవ్

**తెల్లాపూర్, జూలై 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



సంగారెడ్డి జిల్లా బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ప్రవీణ్ కుమార్ యాదవ్ తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ) ఎస్పీ బి. సాయి శ్రీ (ఐపీఎస్)లిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, వాటి నివారణ చర్యలు, ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరంపై చర్చించారు. డిజిటల్ యుగంలో ఆన్లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించడం ద్వారా సైబర్ నేరాలను తగ్గించవచ్చని ఎస్పీ బి. సాయి శ్రీ సూచించినట్లు ప్రవీణ్ కుమార్ యాదవ్ తెలిపారు. సురక్షిత డిజిటల్ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతో క్రీడలకు కొత్త ఊపు



**నిర్మల్,09 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి, నాణ్యమైన శారీరక విద్యకు ఊతమిచ్చే లక్ష్యంతో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని గురువారం హైదరాబాద్లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు, ఎంపీ పి.టి. ఉష ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశాల మేరకు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వర్చువల్ సమావేశం నిర్వ హించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి బి. శ్రీకాంత్ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్ష ణకు సీసీ కెమెరాల'నిఘా అత్యంత కీలకం

- కరీంనగర్ సీపీ గౌస్ ఆలం
- హుజురాబాద్ డివిజన్ పరిధిలో 21 నూతన సీసీ కెమెరాలను ప్రారంభించిన పోలీస్ కమిషనర్
- కమిషనరేట్ వ్యాప్తంగా మరో 700 కెమెరాల ఏర్పాటు లక్ష్యం
- యువత డ్రగ్స్,సైబర్ గేమింగ్ అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి సారించాలి
- రోడ్డు ప్రమాద బాధితులను కాపాడితే 'రహవీర్' పథకం ద్వారా రూ.25 వేల బహుమతి





**హుజురాబాద్/జమ్మికుంట, జులై 09 (తెలంగాణ వాణి)**

శాంతి భద్రతల పరిరక్షణలో మరి యు నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ముఖ్యంగా సీసీటీవీ కెమెరాల పాత్ర అత్యంత కీలకమని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పేర్కొన్నారు. హుజురాబాద్ డివిజన్ పరిధి లోని సైదాబాద్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను,కోరపల్లి గ్రామంలోని 05 సీసీ కెమెరా లను ఆయన గురువారం ప్రారంభించారు.అనంతరం జమ్మికుంట పట్టణ మరియు రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదా నంలో నిర్వహించిన వాలీ బాల్ టోర్నమెంట్ విజేతలకు సీపీ జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా జమ్మికుంట లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో విద్యార్థులు,ఆటో డ్రైవర్లు,ప్రజలతో ఏర్పాటు చేసిన విస్తృత అవగాహన సదస్సులో సీపీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిం చారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడితూ సీసీటీవీల విస్తరణ: ప్రతి గ్రామం,పట్టణం మరియు కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని ప్రతి మూలను సీసీటీవీ నిఘా నీడలోకి తీసుకురావడమే పోలీసుల ముఖ్య ఉద్దేశం.రాబోయే రోజుల్లో కమిషనరేట్ పరిధిలో మరో 700 కొత్త కెమెరాలను అమర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. సైబర్ నేరాలు – ఆన్లైన్ గేమింగ్ ముప్పు: ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా చిన్న పిల్లలు, యువత ఆన్లైన్ గేమింగ్ బారిన పడి డబ్బులు నష్టపో వడమే కాకుండా ఆత్మహత్య లకు పాల్పడుతున్నారు. కరీంనగర్ జిల్లాలోనూ ఇలాం టి ఘటనలు వెలుగుచూస్తు న్నాయి.తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలి. మత్తు పదార్థాల నిర్మూలన: యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్,ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.గ్రామీణ ప్రాంతాల్లో వీటి సరఫరా లేదా వాడకంపై సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదా 'డయల్ 100'కు సమాచారం అందించాలి.యువత మత్తు కు బానిస కాకుండా క్రీడలపై దృష్టి సారించాలి.

రోడ్డు భద్రత – రహవీర్ పథకం: వాహనదారులు, ప్రయాణికులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధ నలు పాటించాలి.రోడ్డు ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి చేర్చి వారి ప్రాణాలు కాపాడే వారికి ప్రభుత్వం రహవీర్ పథకం కింద రూ.25,000 నగదు పురస్కారం అందిస్తుంది.ఈ విషయాన్ని ప్రజలందరూ గమనించాలి.సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన సైదాబాద్ సర్పంచ్ రాజారామ్,కోరపల్లి సర్పంచ్ మధుసూదన్,స్థానిక ప్రజాప్రతినిధులకు,గ్రామ ప్రజలకు సీపీ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలి పారు.ఈ కార్యక్రమంలో హుజురా బాద్ ఏసీపీ వి.మాధవి, జమ్మికుంట సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ,జమ్మికుంట రూరల్ ఇన్స్పెక్టర్ వెంకట్, ఎస్సైలు ఆవుల తిరుపతి, స్వాతి,క్రాంతిలతో పాటు స్థానిక పోలీస్ సిబ్బంది,గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పల్లెల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కృషి చేయాలి

- గ్రామాలపై పూర్తి అవగాహన తో సర్పంచులు పనిచేయాలి.
- సొంత ఆదాయ మార్గాలు పెంపొందించుకోవాలి
- గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి
- సర్పంచులు, కార్యదర్శు లకు సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



**కరీంనగర్:జూలై 09 (తెలంగాణ వాణి ప్రతినిది)**

గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా సర్పంచులు, కార్యదర్శులు బాధ్యతాయు తంగా పనిచేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే పిలుపునిచ్చారు.గ్రామాలను ఉత్తమ గ్రామపంచాయ తీలుగా తీర్చిదిద్దేందుకు గ్రామాలపై పూర్తి స్థాయి అవగాహనతో పాటు దీర్ఘకా లిక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని సూచించా రు.గురువారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో 'ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక' గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు,కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ కార్యక్రమం లో పంచాయతీరాజ్ డిప్యూ టీ కమిషనర్ కె.అనిల్ కుమార్తో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.అదనపు కలెక్టర్ మాట్లాడు తూ,గ్రామపంచాయతీలు కేవలం కేంద్ర,రాష్ట్ర ప్రభు త్వాల నిధులపైనే ఆధారపడ కుండా సొంత ఆదాయ వనరులను అభివృద్ధి చేసుకునే దిశగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు.గ్రామాల ఆర్థిక స్వావలంబన పెరిగితేనే స్థిరమైన అభివృద్ధి సాధ్యమ వుతుందన్నారు.ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న నిధులతో గ్రామాలను అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలన్నారు.కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద కొత్తగా ప్రవేశ పెట్టిన వీబీజీ--రామ్ జీ పథకం ద్వారా 318 రకాల అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉందని తెలిపారు.ఈ అవకాశాన్ని సర్పంచులు, కార్యదర్శులు సమర్థంగా వినియోగించుకుని గ్రామాల్లో మౌలిక వసతులు,ప్రజా సౌకర్యాలను మెరుగుపర చాలని సూచించారు. పంచాయతీరాజ్ చట్టం, గ్రామపంచాయతీల విధులు, బాధ్యతలపై పూర్తి అవగా హన పెంపొందించుకోవాలని, గ్రామపంచాయతీ ప్రొఫైల్ తయారీ,ఆదాయ వనరుల గుర్తింపు,రానున్న మూడు సంవత్సరాలకు సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొం దించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిబద్ధతతో పనిచేస్తే ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ కె.అనిల్ కుమార్ మాట్లాడుతూ,ఎన్ఆర్ఈజీ ఎస్ కింద అమలు చేస్తున్న వీబీజీ--రామ్ జి పథకం ద్వారా గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టవచ్చు న్నారు.నిధులు రావనే అపోహలకు తావివ్వకుండా అందుబాటులో ఉన్న అవకాశాలను పూర్తిగా వినియోగిం చుకోవాలని సూచించారు.ప్రభుత్వ నిధులతో పాటు గ్రామాల సొంత ఆదాయాన్ని పెంచు కునే చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ మాట్లాడుతూ, సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తే గ్రామాల అభివృద్ధి వేగవంతమవుతుందని తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దే అవకాశం ఉందని,సొంత ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు గ్రామపంచాయతీ ప్రొఫైల్ తయారీ,ఆదాయ వనరుల పెంపు,మూడేళ్ల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన,వీబీజీ--రామ్ జీ పథకం కింద చేపట్టే అభివృద్ధి పనులపై సర్పంచులు, కార్యదర్శులకు విస్తృతంగా శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయ తీరాజ్ డిప్యూటీ కమిషనర్ కే అనిల్ కుమార్,జెడ్పీ సీఈవో పవన్ కుమార్,డీపీఓ జగదీ శ్వర్,డీఆర్డీఓ గీత,పంచా యతీరాజ్ డీఈ జనార్ధన్, మాస్టర్ ట్రైనర్లు,సర్పంచులు, కార్యదర్శులు,మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వరికి ప్రత్యామ్నాయ పంటలపై రైతులను ప్రోత్సహించాలి

- ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి
- రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలి
- వ్యవసాయ అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో ఉండాలి
- కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్:జులై 09 (తెలంగాణ వాణి ప్రతినిది)**

జిల్లాలో లోటు వర్షపాతం నమోదవుతున్నందున,ఎల్ నినో ప్రభావం చూపే అవకాశం ఉన్నందున వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహిం చాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వ్యవసాయ అధికారు లను ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం,వానాకా లం సాగు,తదుపరి కార్యాచర ణ అంశంపై రాష్ట్ర నీటిపారు దల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. ఈ సమావేశంలో పాల్గొన్న అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వ్యవసాయ,నీటిపారు దల తదితర శాఖల అధికా రులతో మాట్లాడారు.కరీంన గర్ జిల్లాలో ఇప్పటివరకు లోటు వర్షపాతం ఉందని, ఎల్ నినో ప్రభావం కూడా కనిపిస్తున్నందున రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని అన్నారు.రైతు వేదికల్లో వ్యవసాయ అధికారులు సమావేశాలు నిర్వహించి రైతులకు సూచనలు అందిం చాలన్నారు.ఆరుతడి పంటలు,పప్పు ధాన్యాలు, తృణ ధాన్యాలు,నూనె గింజలు,కూరగాయలు వంటి పంటల సాగు ఆవశ్యకత తెలియజేయాలని ఆదేశించా రు.దీనివల్ల ఎల్ నినో ప్రభా వాన్ని కొంతమేర అధికమించ వచ్చని,రైతులకు నష్టం జరగకుండా ఉంటుందని సూచించారు.జిల్లాలో బావులు,బోరుబావుల ద్వారా కూడా ఎక్కువ మొత్తంలో పంటలు సాగు అవుతున్నం దున,ఆరుతడి పంటలకు ఎలాంటి ఇబ్బందులు ఉండ వని,తక్కువ నీటితో పంట చేతికి వస్తుందని అన్నారు. ఆన్లైన్ ద్వారా యూరియా అమ్మకాల ప్రక్రియ కొనసాగు తున్నందున జిల్లాలో ఎరువు ల పంపిణీకి ఎలాంటి ఇబ్బం దులూ ఉండబోవని అన్నారు. యూరియా అమ్మకాల ప్రక్రియ ను వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాల ని ఆదేశం చారు. ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్న వడ్లను మాత్రమే సాగు చేయాలని, తద్వారా బోనస్ పొందవచ్చు ని కలెక్టర్ తెలిపారు.ఈ రకాలను ప్రతి రైతుకు తెలియ జేయాలని అన్నారు.ప్రతి రైతు వేదికను ఉపయోగించు కొని స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో రైతులకు వానాకాలం వ్యవసాయానికి సంబంధించిన ప్రతి సూచన తెలియజేయాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారు లు నీటి లభ్యత,విడుదల తదితర అంశాలపై పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని,వ్యవసాయ, నీటిపారుదల శాఖలు సమన్వయంతో రైతు శ్రేయస్సు కోసం పనిచేయా లని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా ప్రతి రైతుకు సాంకేతిక సలహా లు,వాతావరణ సూచన, పంటల ఎంపికపై మార్గదర్శ కాలు ఇవ్వాలన్నారు.జిల్లాలో పరిస్థితిని ఎప్పటికప్పుడు మండలాల వారీగా సమీక్షిస్తా నని తెలిపారు.అధికారుల సూచనలు రైతులు పాటిం చాలని,ఎలాంటి వదంతుల ను నమ్మవద్దని కోరారు.ఎల్ నినో ప్రభావాన్ని సమర్థవం తంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం,జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని వివరించారు.వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు నిత్యం అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వీబిజిరామ్ జి పథకం అమలుకు సరైన ప్రణాళిక రూపొందించి కూలీలకు వీలైనన్ని ఎక్కువ పని దినాలు కల్పించాలని తెలిపారు.

## కవిత ఆరోపణల పై సీబీఐ విచారణకు ఆదేశించాలి



నిజామాబాద్: ఎమ్మెల్సీ, తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత చేసిన ఆరోపణల పై స్వతంత్ర సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. నిజామాబాద్లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ స్వయంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ సభ్యురాలు కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావుల పై చేసిన అవినీతి, క్విడ్ ప్రో కో ఆరోపణల పై స్పందించారు. కేటీఆర్, హరీశ్ రావుల పై వచ్చిన క్విడ్ ప్రో కో వంటి ఆరోపణలు సాధారణమైనవి కావని అన్నారు. కవిత చేసిన ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నిధులు, క్విడ్ ప్రో కో లావాదేవీలు, ప్రదీప్ కన్స్ట్రక్షన్స్తో జరిగినట్లు ఆరోపించిన ఒప్పందాలు, ఫీనిక్స్ సంస్థకు రాజకీయ అండ, గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్కు చెందిన కాంట్రాక్టర్లకు భూముల కేటాయింపుల పై కవిత చేసిన వ్యాఖ్యలు ప్రజాప్రయోజనాలకు సంబంధించినవని అర్వింద్ అన్నారు. ఈ అంశాల పై ఎలాంటి అనుమానాలకు తావులేకుండా స్వతంత్ర సీబీఐ దర్యాప్తు జరిపించాలని ఆయన సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసును సీబీఐకి అప్పగించడంలో జాప్యం, ఈ-కార్ రేసు వ్యవహారంలో ఆరోపణలు ఉన్నప్పటికీ విచారణ ముందుకు సాగకపోవడం, ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధ్యుల పై ఇప్పటి వరకు కఠిన చర్యలు తీసుకోకపోవడం వంటి పరిణామాల వల్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధి పై ప్రజల్లో ఇప్పటికే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అర్వింద్ పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కయ్యాయనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడుతోందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలంటే ప్రభుత్వం వెంటనే ఈ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించి, పూర్తిపారదర్శకతతో నిజానిజాలను వెలికితీసి, బాధ్యుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.

## గ్రంథాలయాలు యువత భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి

**మంత్రి దామోదర్ రాజనర్సింహా, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి**



**సంగారెడ్డి/కంగ్టి, జూలై 9 ( తెలంగాణ వాణి ప్రతినిధి)**
సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలోని హేమారెడ్డి మల్లమ్మ ఆలయ సమీపంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహా, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డితో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "ఒక పుస్తకం ఒక తరాన్ని మారుస్తుంది.. ఒక గ్రంథాలయం ఒక గ్రామాన్ని మార్చగలదు" అని అన్నారు. పుస్తకాల ద్వారానే సమాజం విజ్ఞానవంతమవుతుందని, జ్ఞానానికి నిలయంగా ఈ గ్రంథాలయం నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, యువత పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా అన్ని ఆధునిక సౌకర్యాలతో గ్రంథాలయాన్ని నిర్మిస్తామని తెలిపారు. ఇందులో తెలుగు, ఇంగ్లీష్, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలతో పాటు జనరల్ నాలెడ్జ్ విభాగం, డిజిటల్ లైబ్రరీ, కంప్యూటర్లు, ఇంటర్నెట్, వార్తాపత్రికలు, ప్రశాంతంగా చదువుకునే వాతావరణం కల్పిస్తామని చెప్పారు. "చదువే నిజమైన సంపద. యువత విద్యను ఆయుధంగా మార్చుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలి" అని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమాహారతి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్మన్ నాగేష్ షెట్కార్, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అమర్నాథ్ జీ సన్నిధిలో కేసీఆర్, కొప్పుల ఈశ్వర్ ల కోసం ప్రత్యేక ప్రార్థనలు

**తెలంగాణ రాష్ట్ర శ్రేయస్సు, సంక్షేమం కోసం ప్రార్థన**

**కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని, కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్యే కావాలని మొక్కులు**

**ఎండపల్లి జూలై 09 (తెలంగాణ వాణి)**
జమ్మూ కాశ్మీర్‌లోని అత్యంత పవిత్రమైన, కఠినమైన శ్రీ అమర్నాథ్ యాత్రను జగిత్యాల జిల్లా ఎండపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మారం జలంధర్ రెడ్డి విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. సముద్ర మట్టానికి సుమారు 12,756 అడుగుల ఎత్తులో ఉన్న అమర్నాథ్ మంచు లింగాన్ని దర్శించుకునేందుకు, ఆయన బాల్తాల్ బేస్ క్యాంపు నుండి 14 కిలోమీటర్ల అత్యంత కఠినమైన మార్గంలో కాలినడకన ప్రయాణించి స్వామివారిని దర్శించుకున్నారు. అమర్నాథ్ జీ సన్నిధిలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మారం జలంధర్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర సంక్షేమంతో పాటు తన వ్యక్తిగత, రాజకీయ ఆకాంక్షలను కూడా స్వామివారి ముందు ఉంచినట్లు జలంధర్ రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రానికి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని, అలాగే ధర్మపురి నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్యేగా మరోసారి అవకాశం లభించాలని శ్రీ అమర్నాథ్ జీ సన్నిధిలో ప్రత్యేకంగా ప్రార్థించినట్లు ఆయన వెల్లడించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో సాగిన ఈ యాత్ర విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, తెలంగాణ ప్రజలందరికీ భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు.



## శాశ్వత ఆస్తుల నిర్మాణానికే వి.బి.జి. రామ్‌జీ పథకం వినియోగించాలి

**గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు శాస్త్రీయంగా రూపొందించాలి : కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**జగిత్యాల, జూలై 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వి.బి.జి. రామ్‌జీ పథకాన్ని సమర్థవంతంగా వినియోగించి గ్రామాల్లో శాశ్వత ప్రభుత్వ ఆస్తుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లో పలు మండలాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాల అవసరాలకు అనుగుణంగా శాస్త్రీయంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వ నిధులను సమర్థంగా వినియోగించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన వి.బి.జి. రామ్‌జీ పథకం ద్వారా పాఠశాలలు, అంగనవాడీలు, గ్రంథాలయాలు, కమ్యూనిటీ హాళ్లు, గోదాములు, కోల్డ్ స్టోరేజీలు, బస్టాండ్లు, సోలార్ వీధి దీపాలు వంటి శాశ్వత ఆస్తుల నిర్మాణానికి అవకాశం కల్పించామని తెలిపారు. గ్రామ పంచాయతీలు తమ నిధుల్లో కనీసం 50 శాతం శాశ్వత ఆస్తుల సృష్టికే కేటాయించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ్ గౌడ్, జెడ్పీ సీఈఓ గౌతం రెడ్డి, డీఆర్‌డీఓ రఘువరన్, డీపీఓ మధుసూదన్, ఎంపీడీవో చిరంజీవి, సంబంధిత జిల్లా అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

## నారుమడుల్లో చీడపీడల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

**రైతులకు సూచించిన వ్యవసాయ అధికారి సతీష్**

**పెద్దపల్లి, జూలై 9 (తెలంగాణ వాణి):**
అంతర్గాం మండలంలో సన్న రకాల వరి నారుమడులను వ్యవసాయ అధికారి కే. సతీష్ పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.నారు తీయడానికి వారం రోజుల ముందు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు వేయాలని, తెగుళ్ల నివారణకు తగిన శిలీంద్రనాశక మందులను పిచికారీ చేయాలని సూచించారు. 16--30 రోజుల వయస్సు గల లేత నారును మాత్రమే నాటాలని, కాలిబాటలు ఏర్పాటు చేయడం ద్వారా గాలి, వెలుతురు బాగా అందడంతో చీడపీడల వ్యాప్తి తగ్గుతుందని తెలిపారు.



# ఖేడ్‌లో 47లక్షలతో ఏటీసీ సెంటర్‌కు శంకుస్థాపన చేసిన రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి

- **జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్**
- **ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి**

**నారాయణఖేడ్, జూలై 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నారాయణఖేడ్ నియోజకవర్గంలోని జుక్కల్ శివారులో రూ.47 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఏటీసీ (ఏటీసీ) సెంటర్‌కు రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు,ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు పరిపాలనను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ ఏటీసీ సెంటర్ దోహదపడుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు నాణ్యమైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు.ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ మాట్లాడుతూ, --రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ, నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కట్టుబడి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో టీజీ ఐఐసీ చైర్ పర్సన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్,జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ , సబ్ కలెక్టర్ ఉమా హారతి,అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది, స్థానిక నాయకులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జీవో నెం.6 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలి

**కాంట్రాక్ట్ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలి: సీఐటీయూ**

**పటాన్‌చెరు, జూలై 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జీవో నెం.6 ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు సవరించిన కనీస వేతనాలను జూన్ 1 నుంచే అమలు చేయాలని, పెరిగిన జీవన వ్యయానికి అనుగుణంగా నెలకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు, పాశమైలారం ఇండస్ట్రియల్ క్లస్టర్ కన్వీనర్ అతిమేల మానిక్ డిమాండ్ చేశారు.పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై గురువారం కరపత్రాన్ని విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికుల పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం.6ను విడుదల చేసిందని, అయితే నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వేతనాలు శాస్త్రీయంగా పెంచలేదని విమర్శించారు. పారిశ్రామిక ప్రాంతంలోని అనేక సంస్థల్లో కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, గ్రాట్యుటీ వంటి చట్టబద్ధ హక్కులు అమలు కావడం లేదని ఆరోపించారు. 12 గంటల పనికి తగిన ఓవర్‌టైమ్ చెల్లించడం లేదని, వారాంతపు సెలవులు, జాతీయ, పండుగ సెలవుల్లో పని చేసినా డబుల్ వేతనం ఇవ్వడం లేదని అన్నారు. పే స్లిప్‌లు, గుర్తింపు కార్డులు, క్యాంటీన్, రవాణా, యూనిఫాం, భద్రతా పరికరాలు వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని, కార్మిక చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పట్టించుకోకపోతే పరిశ్రమల ఎదుట ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు రాజు, వెంకటేష్, గోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



# బోర్‌వెల్ రీఛార్జ్ పిట్‌కు మార్కింగ్

**హాజరైన డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య**

**హుస్నాబాద్ రూరల్, జూలై 9 (తెలంగాణ వాణి):**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మాలపల్లి గ్రామంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బోర్‌వెల్ రీఛార్జ్ పిట్ మార్కింగ్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వెన్న స్వర్ణలత రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సందర్భంగా బోర్‌వెల్ రీఛార్జ్ పిట్‌ను మార్కింగ్ చేసిన ఆయన, వర్షపు నీటిని భూమిలోకి ఇంకించడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుందని తెలిపారు. గ్రామంలోని మురుగునీటి సమస్య పరిష్కారానికి మ్యాజిక్ డ్రెయిన్ నిర్మించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెన్న రాజు, ఏపీఓ పద్మ, ఈసీ పరుశరాములు, పంచాయతీ కార్యదర్శి దివ్య, ఉపసర్పంచ్ బత్తుల శ్రీనివాస్, ఈజీఎస్ టీఏ భాస్కర్, వార్డు సభ్యులు బత్తుల వీరస్వామి, సొల్లు రజనీకాంత్, గుండాల ప్రశాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ రేణుక, సిబ్బంది అనిల్, సారయ్యతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు



## ఎల్‌నినో ను దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

**నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్.**

**నల్గొండ జులై 9( తెలంగాణ వాణి ప్రతినిధి )**
ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లాలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, మున్సిపాలిటీ ఇంజనీర్లతో తాగునీటి సరఫరాపై సమీక్షించారు. వర్షపాతం తక్కువగా ఉండే పరిస్థితుల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అన్నారు.ప్రజలకు నిర్ణీత సమయాల్లో తాగునీరు అందించాలని , ఆ సమయాలను ముందుగానే కాలనీ వాసులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. నీటి సరఫరా పైపులైన్లలో లీకేజీలు లేకుండా ఇంజనీర్లు నిరంతరం పర్యవేక్షించాలని, లీకేజీలు గుర్తించిన వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు.ప్రతి వారం తాగునీటి సరఫరాపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలని సూచించారు. రిజర్వాయర్ల చుట్టూ భద్రతా చర్యలలో భాగంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అక్కంపల్లి రిజర్వాయర్ నుంచి పానగల్లు ఉదయ సముద్రానికి నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు.లైనింగ్ పనుల కారణంగా నీటి సరఫరాకు ఆటంకం కలగకుండా వారం రోజులపాటు పనులను నిలిపివేయాలని, అవసరమైన మేర నీటి నిల్వలు నిండిన తర్వాత తిరిగి పనులు ప్రారంభించుకోవాలని కలెక్టర్ తెలిపారు.తాగునీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, మున్సిపాలిటీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశానికి స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ఆర్డీవో అశోక్ రెడ్డి, ఈఈ నెహ్రూ నాయక్,ఎస్ ఈ నాగేశ్వరరావు, జాన్ నాయక్, మున్సిపల్ ఈ ఈ వెంకటేశ్వర్లు , డీఈ లు ,ఇంజనీర్లు హాజరయ్యారు.



# గీతంలో బీబీఏ (ఎంటర్ ప్రెన్యూర్ షిప్) కోర్సు

**బోవర్ స్కూల్ ఆఫ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ సహకారంతో ప్రారంభం**

**పటాన్ చెరు, జులై 9,(తెలంగాణ వాణి రిపోర్టర్):**
బోవర్ స్కూల్ ఆఫ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ సహకారంతో హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఒక వినూత్నమైన బీబీఏ (ఎంటర్ ప్రెన్యూర్ షిప్) కోర్సును 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నట్టు గురువారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించారు. ఈ కోర్సు విద్యార్థులకు అద్భుతమైన విద్యా నైపుణ్యం, ఆచరణాత్మక వ్యాపార నిర్మాణ అనుభవాలను అందించి, వారిని భవిష్యత్ పారిశ్రామిక వేత్తలు, ఆవిష్కర్తలు, వ్యాపార నాయకులుగా తీర్చిదిద్దేలా రూపొందించామన్నారు.ఈ నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ కోర్సు, ఫైనాన్స్, మార్కెటింగ్, స్ట్రాటజీ, ఆపరేషన్స్, అనలిటిక్స్, మేనేజ్ మెంట్ వంటి ప్రధాన వ్యాపార విభాగాలను, వెంచర్ క్రియేషన్ లో అనుభవ పూర్వక అభ్యాసంతో అనుసంధానిస్తుందని తెలిపారు. స్టార్టప్ ల్యాబ్ లు, వ్యవస్థాపకులతో ముఖాముఖి, ఇన్నోవేషన్ స్టూడియోలు, కేస్ స్టడీస్, కస్టమర్ డిస్కవరీ, వెంచర్ డెవలప్ మెంట్ ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులు ఆచరణాత్మక అనుభవాన్ని పొందుతారని వివరించారు. హైదరాబాదు లోని టి-హబ్ లో ఉన్న బోవర్ స్కూల్ ఆఫ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ ద్వారా పరిశ్రమతో ఈ కార్యక్రమానికి బలమైన అనుసంధానం ఉండటం దీనిలోని ఒక ముఖ్యమైన విశేషంగా అభివర్ణించారు. విద్యార్థులకు మార్గదర్శులు, పెట్టుబడిదారులు, స్టార్టప్ వ్యవస్థాపకులు, భారతదేశం లోని అత్యంత చైతన్యవంతమైన వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థలలో ఒకదానికి అనుసంధానమవుతారని తెలిపారు. బ్లూమ్ బెర్గ్ సర్టిఫికేషన్, ఇన్నోవేషన్ ల్యాబులు, ప్రోటోటైపు ఫండింగ్ అవకాశాలు, మొదటి ఏడాది నుంచే స్టార్టప్ ఇంటర్న్ షిప్పులు, ఇంకా యాక్సిలరేటర్లు, పిచ్ పోటీలలో పాల్గొనడం వంటివి అభ్యాస అనుభవాన్ని మరింతగా పెంచుతాయన్నారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020కి అనుగుణంగా ఉన్న ఈ పాఠ్య ప్రణాళిక, 162 క్రెడిట్ల ఫ్రేమ్ వర్కుతో ఎనిమిది సెమిస్టర్ల పాటు కొనసాగుతుందని, ఇందులో ప్రత్యేకమైన వెంచర్ ల్యాబులు కూడా ఉన్నాయని వివరించారు. ఇవి విద్యార్థులకు ఆలోచన దశ, వ్యాపార ధ్రువీకరణ, నిధుల సమీకరణ, విస్తరణ, వెంచర్ వృద్ధి వరకు మార్గనిర్దేశం చేస్తాయన్నారు. ఈ కోర్సు పూర్తిచేసిన వారు స్టార్టప్ వ్యవస్థాపకులు, వెంచర్ డెవలప్ మెంట్ మేనేజర్లు, ఇన్నోవేషన్ మేనేజర్లు, ప్రొడక్ట్ మేనేజర్లు, బిజినెస్ డెవలప్ మెంట్ నిపుణులు, వెంచర్ క్యాపిటల్ విశ్లేషకులు, యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ మేనేజర్లు, కుటుంబ వ్యాపార నాయకులు, సామాజిక పారిశ్రామిక వేత్తలు, కార్పొరేట్ ఇన్నోవేటర్లు వంటి విభిన్న కెరీర్ అవకాశాలకు సిద్ధమవుతారని స్పష్టీకరించారు. ఈ కోర్సు పారిశ్రామికవేత్త నిర్వహణ, ఆవిష్కరణ రంగాలలో ఉన్నత విద్యకు బలమైన పునాదిని కూడా కల్పిస్తుందన్నారు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్మీడియట్ లేదా 10ం2లో కనీసం 50 శాతం మార్కులు సాధించి, గీతం ప్రవేశ పరీక్ష (గాట్-2026)లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ కోర్సులో చేరడానికి అర్హులని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులకు ప్రతిభ ఆధారిత ఉపకార వేతనాలను (స్కాలర్ షిప్) గీతం అందిస్తుందన్నారు. మరింత సమాచారం కోసం గీతం వెబ్ సైట్ **www.gitam.edu**ను సందర్శించాలని, లేదా సందీప్ రావళ్ల (87120 18804), వై. శ్రీనివాస్ (87120 18805) లను సంప్రదించాలని సూచించారు.

GITAM
DEEMED TO BE UNIVERSITY





## ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థ ఏబీవీపీ

**78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ**

**దేవరకొండ, జూలై 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవం, 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గవర్నమెంట్ బాయ్స్ హైస్కూల్ నుంచి జడ్పీహెచ్ఎస్ మైదానం వరకు విద్యార్థులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించి ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో-కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ, 1949లో స్థాపించబడిన ఏబీవీపీ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా ఎదిగిందన్నారు. గత 78 ఏళ్లుగా విద్యార్థుల హక్కుల పరిరక్షణ, నాణ్యమైన విద్య, జాతీయ పునర్నిర్మాణం, సామాజిక సేవ, నాయకత్వ వికాసం కోసం సంస్థ విశేషంగా కృషి చేస్తోందని తెలిపారు. "జ్ఞానం--శీలం--ఏకత" అనే త్రిసూత్రంతో విద్యార్థుల్లో జాతీయ భావన, సామాజిక బాధ్యత పెంపొందించడమే ఏబీవీపీ లక్ష్యమని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, క్యాంపస్ అభివృద్ధి, రక్తదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, డ్రగ్స్ నిర్మూలన వంటి కార్యక్రమాల్లో ఏబీవీపీ చురుకుగా పనిచేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి యలమల హేమ సుందర్, లింగాల రాకేష్, సంతోష్, దమ్ముజు అమితేష్ , చరణ్, నరేష్,శివ, గణేష్, వినయ్, అబ్దుల్, చేపూరి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మక్క చెరువుకు సరికొత్త వైభవం

**రూ.4.45 కోట్లతో సుందరీకరణ పనులు : ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**పటాన్‌చెరు, జూలై 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
పటాన్‌చెరు పట్టణంలోని తిమ్మక్క చెరువును రూ.4.45 కోట్ల వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి చెరువు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. హెచ్ఎండీఏ నుంచి రూ.3.05 కోట్లు, సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.1.40 కోట్లతో చేపట్టిన ఈ పనుల్లో వాకింగ్ ట్రాక్, బతుకమ్మ ఘాట్, ఓపెన్ జిమ్, చిన్నారుల ఆటస్థలం, హరితవనం, ల్యాండ్‌స్కేపింగ్, విశ్రాంతి బెంచీలు, స్వాగత తోరణాల ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. రూ.30 లక్షలతో రక్షణ కంచె పనులు ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు. పనులు పూర్తయిన అనంతరం తిమ్మక్క చెరువు ప్రజలకు ఆరోగ్యకరమైన విహార కేంద్రంగా, పర్యాటక ఆకర్షణగా మారుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సాకి చెరువు, తిమ్మక్క చెరువులను పటాన్‌చెరుకు ప్రత్యేక గుర్తింపుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, హెచ్ఎండిఏ డిఈ రామారావు, ఏపీ ఆర్ సంస్థ చైర్మన్ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధు సూదన్ రెడ్డి, నర్రా బిక్షపతి, మాదిరి పృథ్వీరాజ్, వెంకటేష్, రాజు, ధనరాజ్ గౌడ్, బోజయ్య, షకీల్, పట్టణ పుర ప్రముఖులు, బిఆర్ఎస నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఫారముల ఆన్ లైన్ వెంట వెంటనే పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**

**నిర్మల్, జూలై 09 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, గురువారం బాసర, తానూర్, కుబీర్, మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ముందుగా బాసర గ్రామపంచాయితీ ఆవరణలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను పరిశీలించారు. గడువులోగా ఎస్ఐఆర్ ఫారముల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ఫారంలను పూరించుటలో ఓటర్లకు అవగాహన కల్పించాలని అన్నారు. ఇప్పటివరకు పూర్తయిన ఎస్ఐఆర్ ఫారముల డిజిటలీకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓ లు క్షేత్రస్థాయిలో ఓటర్లకు ఎస్ఐఆర్ విషయంలో సహాయం చేయాలన్నారు. సూపర్వైజర్లు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం తానూరు



మండలం సింగన్ గావ్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. మొత్తం పంపిణీ చేసిన ఫారములు, ఇప్పటివరకు, తిరిగి తీసుకున్న ఫారములు, పూర్తి చేసిన డిజిటలైజేషన్ వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కుబీర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఎస్ఐఆర్ ఫారములు నింపుటలో ఓటర్లకు సహాయం చేయాలని బిఎల్ఓ లకు అధికారులకు సూచించారు. ఇప్పటివరకు పూర్తయిన డిజిటలైజేషన్ ప్రక్రియ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గడువులోగా ప్రక్రియను మొత్తం పూర్తి చేయాలని ఆదేశించారు. యాప్ లో వివరాలను పరిశీలించారు. సమీపంలోని ఓటర్ ఇంటికి వెళ్లి, వారు ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేశారో లేదో అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలలో తహసిల్దార్లు పవన్ చంద్ర, మహేంద్రనాథ్, శ్రీదేవి, ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ లు వెంకటేష్ గౌడ్, అన్నపూర్ణ, సాయినాథ్ లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ ప్రకారం గౌరవం ఇవ్వాలి



**కమ్మరి నరేందర్ చారి**

**సంగారెడ్డి/కంగ్టి, జూలై 9 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: ప్రజల చేత ఎన్నికైన ప్రతి ప్రజాప్రతినిధికి రాజ్యాంగం, ప్రోటోకాల్ ప్రకారం తగిన గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని యువజన సంఘ నాయకుడు కమ్మరి నరేందర్ చారి అన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, అధికారులు కూడా రాజ్యాంగబద్ధమైన విధానాలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగబద్ధమైన హోదా లేని వ్యక్తులు అధికార వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం సరికాదని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం--2005 ప్రకారం ప్రభుత్వ సమాచారాన్ని కోరే హక్కు ప్రతి పౌరుడికి ఉందని ఆయన తెలిపారు.

## జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయండి



**డా. సుస్మిత పిలుపు**

**ధర్మారం, జూలై 9 (తెలంగాణ వాణి):**
ఈ నెల 13న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. సుస్మిత కోరారు. 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, యుక్తవయస్కులకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఆ రోజు మాత్ర తీసుకోలేని వారికి జూలై 22న నిర్వహించే మాప్-అప్ కార్యక్రమంలో అందజేస్తామని చెప్పారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు తప్పనిసరిగా మాత్రలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## బండ్లగూడలో ప్రత్యేక ఎస్ ఐ ఆర్, ఓటరు నమోదు, ఓటర్ సెర్చ్ కార్యక్రమం



**పటాన్ చెరు, జూలై 9, (తెలంగాణ వాణి రిపోర్టర్)**
పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ సూచనల మేరకు, జేపీ కాలనీ డివిజన్ అధ్యక్షులు భరత్ కుమార్ ఆధ్వర్యంలో బండ్లగూడ లోని హనుమాన్ ఆలయం వద్ద ఓటరు నమోదు ఎస్ ఐ ఆర్ ఎన్యూమరేషన్ ఫారం ఫిల్లింగ్, ఓటర్ సెర్చ్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు ఓటరు నమోదు ఫారాలను నింపించడంతో పాటు, వారి ఓటరు వివరాలను పరిశీలించారు. ఓటరు జాబితాలో పేరు లేని అర్హుల వివరాలను సేకరించి, వాటిని నమోదు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ప్రతి అర్హులైన పౌరుడు తన ఓటు హక్కును నమోదు చేసుకోవడంతో పాటు, ఓటరు జాబితాలో తన పేరు ఉందో లేదో తప్పని సరిగా పరిశీలించాలని నాయకులు సూచించారు. ఈ క్రమంలో అధిక సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ విషయమై మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ఓటరు నమోదు, కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ తప్పకుండా పాల్గొనాలని సూచించారు. అర్హులైన ఏ ఒక్కరూ తమ ఓటు హక్కును కోల్పోకుండా జాగ్రత్త పడాలని అన్నారు. వారికి ఏ అవసరమైనా ప్రత్యేక శిక్షణ ఇవ్వబడిన బి ఆర్ ఎస్ కార్యకర్తలు సహాయపడతారని అన్నారు. భారతీయ పౌరులుగా ఓటు మన హక్కు అని దానిని ఎంతమాత్రం అశ్రద్ధ చేయకూడదని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బండ్ల గూడ డివిజన్ అధ్యక్షులు భరత్ కుమార్, గొల్ల కృష్ణ యాదవ్, లక్ష్మణ్ యాదవ్, సురేష్ రెడ్డి, అఫ్జల్, ఊర్మిళ, షాబెర, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి

**క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నిజామాబాద్, జూలై 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. గురువారం నిజామాబాద్ రూరల్‌లోని గాంధీనగర్ తండా, గూపన్‌పల్లి, నగరంలోని శంకర్ భవన్ పాఠశాలలో ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. అందుబాటులో లేని ఓటర్లకు సమాచారం అందించి గడువులోపు ఫారాలు స్వీకరించాలని, విదేశాల్లో ఉన్న ఓటర్ల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని బీఎల్ఓలకు సూచించారు. చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్లిన, డబుల్ ఓట్లు ఉన్న వారిని గుర్తించి ఓటరు జాబితాలో నమోదు చేయాలని, ఓటర్లతో మర్యాదగా వ్యవహరిస్తూ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల బీఎల్ఏలు కూడా బీఎల్ఓలకు సహకరించాలని కోరారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్, తహసీల్దార్ వినయ్ సాగర్ తదితరులు ఉన్నారు.

## బీమాక్ కాలనీలో ఘనంగా SIR కార్యక్రమం



**తెల్లాపూర్ జూలై 9 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
బీమాక్ కాలనీలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (**SIR**) కార్యక్రమం ఎంఆర్ఓ సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ సూపర్వైజర్ నవోద్ రెడ్డి పర్యవేక్షణలో బీఎల్ఓలు రామకృష్ణ రెడ్డి, మంజుల, ఉమేష్, ఆనంద్ పాల్గొని ఓటరు జాబితా సవరణ, వివరాల పరిశీలన, అర్హుల నమోదు, మార్పులు--చేర్పుల ప్రక్రియను నిర్వహించారు. ప్రజలు తమ ఓటరు వివరాలను సరిచేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు.

## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

- కాంగ్రెస్ హయంలోనే ఆలయాల అభివృద్ధి
- అట్టహాసంగా మాధవ నగర్ ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం



**నిజామాబాద్ జూలై 09: (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రజలు ఆధ్యాత్మిక చిం తనతో ముందుకు సాగితే సమాజంలో శాంతి, సామ రస్యం నెలకొంటాయని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూప తి రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాం లోనే ఆలయాల అభివృద్ధి సాధ్యమవుతోందని,రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూప తి రెడ్డి అన్నారు. మాధవ నగర్ ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీ కార మహోత్సవం అట్ట హాసంగా జరుపుకున్నా రు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేను వేద పండి తులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాదరంగా స్వాగతం పలికారు. అనం తరం ఎమ్మెల్యే ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. డిచ్‌పల్లి మం డలం బర్ది పూర్ శివారు మాధవ్‌న గర్ సాయి బా బా ఆలయంలో గురువా రం నిర్వహించిన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకా ర మహోత్సవంలో నగర మేయర్ ఉమారాణి, ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి లు ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలక మండలి సభ్యులతో ముఖ్య అతిథులు ప్ర మాణ స్వీకారం చేయిం చారు. అనంతరం ఏర్పా టు చేసిన కార్యక్రమంలో.. ఆలయ పాలకవర్గ నూత న చైర్మన్ చలసాని మీనా- శ్రీనివాస్ లతో పాటు నూ తన కార్యవర్గ సభ్యులకు రూరల్ ఎమ్మెల్యే నియా మక పత్రాలు అంద జేశారు.

**కాంగ్రెస్ తోనే దేవాల యాల అభివృద్ధి**

**రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి..**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభు త్వం ఏర్పడిన తర్వాత దేవాలయాల అభివృద్ధికి కొత్త ఊపు వచ్చిందని, కాంగ్రెస్తోనే దేవాలయాల అభివృద్ధి జరిగిందని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భద్రాచ లం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం సహా అనేక ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. దేవాలయాల ఆదాయం, ఆస్తులు భక్తు ల విశ్వాసానికి ప్రతీకలని, వాటి నిర్వహణలో ఎలాం టి అవకతవకలు జరిగినా సహించమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సాయి బాబా ఆలయ నూతన పాలకవర్గం భక్తులకు మెరుగైన సేవలు అంది స్తూ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచిం చారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్ర భుత్వం టెంపుల్ టూరి జం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఆధ్యాత్మిక క్షేత్రాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. డిచ్‌పల్లి ఖిల్లా రామాలయ అభివృద్ధికి రూ. 3 కోట్లతో ప్రతిపా దనలు సిద్ధం చేశామని వెల్లడించారు. ఈ కార్యక్ర మంలో ఆలయ పాలకవర్గ చైర్మన్ చలసాని మీనా- శ్రీనివాస్, డైరెక్టర్లు, నగర మేయర్ ఉమారాణి, రా ష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మ న్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, కాంగ్రెస్ పార్టీ నా యకులు తరుణ్, శ్రీనివా స్,వినోద్, ఉమ్మాజి నరేష్, మునిపల్లి సాయి రెడ్డి, రాంచందర్ గౌడ్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షు లు జనార్ధన్,గోవర్ధన్ రెడ్డి, సంజయ్, ప్రజాప్రతిని ధులు, స్థానిక బర్దిపూర్ సర్పంచ్ భాస్కర్, నాయ కులు, భక్తులు పాల్గొన్నారు.

## జాతీయ పునర్నిర్మాణమే ఏబీవీపీ లక్ష్యం

**మృదులయ ఏబీవీపీ జిల్లా మహిళా కన్వీనర్.**

**హుస్నాబాద్, జూలై 09(తెలంగాణ వాణి ఆర్ సి)**
జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించు కుని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హుస్నాబాద్ నగర శాఖ ఆధ్వర్యంలో హుస్నాబాద్ పట్టణంలో పలు విద్యా సంస్థల విద్యార్థుల తో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఏబీవీపీ కార్యకర్తలు జాతీయ జెండాలతో పాల్గొని దేశభక్తి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏబీవీపీ సిద్దిపేట జిల్లా మహిళా కన్వీనర్ మృదులయ మాట్లాడుతూ, జాతీయ పునర్నిర్మాణమే ఏబీవీపీ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమైన ఏబీవీపీ నేడు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, అటక్ నుంచి కటక్ వరకు విస్తరించి 78 లక్షల మంది సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘం గా ఎదిగిందని పేర్కొన్నారు. విద్యార్థి సమస్యల పరిష్కారంతో పాటు జాతీయ సమైక్యత, దేశభక్తి, సామాజిక బాధ్యత పెంపొందించడం లో ఏబీవీపీ కీలక పాత్ర పోషిస్తోందని ఆమె తెలిపారు. దేశాభివృద్ధి, విద్యార్థి సంక్షేమం, జాతీయ వాద విలువల పరిరక్షణ కోసం ఏబీవీపీ



నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. దేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దే ప్రయాణం లో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలనిపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ హుస్నాబాద్ నగర కార్యదర్శి బత్తుల రాజు, జిల్లా ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ చరణ్, నగర ఉపాధ్యక్షుడు బత్తుల సంతోష్, అంజి, నగర సంయుక్త కార్యదర్శి రంజిత్, మిషన్ సాహసి కన్వీనర్ అశ్విని, మహిళా కన్వీనర్లు శిరీష, ప్రసన్న, శరత్, శ్రావణ్, దినాకర్, అఖిల్, పూర్వచందర్, విద్యార్థులు, విద్యార్థినులు, పూర్వ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

- వ్యవసాయ పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ అవసరం
- ప్లాన్ ఆఫ్ యాక్షన్‌తో ముందస్తు చర్యలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, జూలై 09 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో తలెత్తే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం పడకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, నీటి లభ్యత, సాగు పరిస్థితులు, ముందస్తు కార్యాచరణపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జూలై 30 వరకు ఎల్ నినో ప్రభావానికి సంబంధించి వాతావరణ పరిస్థితులను నిరంతరం పరిశీలించాలని సూచించారు. వర్షపాతం ఆశించిన స్థాయిలో లేకపోతే వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, అవసరమైన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని చెరువులు, రిజర్వాయర్లు, ఆనకట్టలు, కాలువలు తదితర నీటి పారుదల వనరుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాధార పంటల సాగు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, వర్షాలు ఆలస్యమైతే రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, తక్కువ కాల వ్యవధిలో పండే పంటలు, నీటి పొదుపు పద్ధతులపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి శాఖ ముందస్తు కార్యాచరణ ప్రణాళిక (ప్లాన్ ఆఫ్ యాక్షన్) సిద్ధం చేసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలను అమలు చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, సి పి ఓ గంగారెడ్డి, నీటి పారుదల శాఖ అధికారులు అనిల్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఈవీఎం గోడౌన్ ను సందర్శించిన కలెక్టర్

**నిజామాబాద్, జూలై 09 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను గురువారం కలెక్టర్ ఇలా త్రిపాఠి అదనపు కలెక్టర్ వి. భుజంగరావు తో కలిసి సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట ఏ. ఓ బాలరాజు, ఎన్నికల విభాగం సిబ్బంది సాత్విక్, విజయేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## గుడుంబా అమ్మకాలు అరికట్టాలి



**మందమర్రి, జూలై 09(తెలంగాణ వాణి విలేకరి)**
మందమర్రి పట్టణంలోని దొరల బంగ్లా ప్రాంతంలో గుడుంబా విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని, స్థానిక ప్రజల జీవన విధానం దెబ్బతింటోందని బస్తీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అక్రమ కార్యకలాపాలను వెంటనే అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆబ్కారీ శాఖతో పాటు జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. గురువారం దొరల బంగ్లా ప్రాంతంలో నిర్వహించిన సమావేశంలో పలువురు బస్తీవాసులు పాల్గొని తమ సమస్యలను వెల్లడించారు. ఈ సందర్భంగా గొర్రె రామచందర్, కనకం రవీందర్, బచ్చలి సురేందర్, బత్తుల సరిత మాట్లాడుతూ దాదాపు గత 25 ఏళ్లుగా ఈ ప్రాంతంలో గుడుంబా తయారీ, విక్రయాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయని ఆరోపించారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ పరిస్థితిలో పెద్దగా మార్పు రాలేదని పేర్కొన్నారు. అక్రమ గుడుంబా విక్రయాలను ప్రోత్సహిస్తున్న వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గుడుంబా మత్తుకు బానిసలవుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని, ముఖ్యంగా నిరుపేద కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండేళ్లలోనే గుడుంబా సేవించి అనారోగ్యానికి గురై 15 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. కుటుంబ పెద్దలను కోల్పోయిన అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో మరిన్ని కుటుంబాలు విషాదంలో మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గుడుంబవిక్రయాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని, గుడుంబా నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంపత్, వెంకటేశ్వర్లు, బాసాని శ్రీనివాస్‌తో పాటు పలువురు స్థానికులు, మహిళలు మ యువకులు పాల్గొన్నారు.

## తెల్లాపూర్‌లో SIR కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్, తెల్లాపూర్ నాయకులు



**తెల్లాపూర్ జూలై 9 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
తెల్లాపూర్ జెడ్ పి హెచ్ ఎస్ స్కూల్ లో నిర్వహించిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (**SIR**) కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు తెల్లాపూర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ కాంగ్రెస్ అధ్యక్షులు సీ పి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు/మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్, గుల్లి రవి, సుధాకర్ రెడ్డి, ధరణి రాజు తదితరులు హాజరై ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని, తమ ఓటరు వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు.

## హై జంప్ మ్యాట్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఆదిలాబాద్, జులై : 09 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోని జిల్లా క్రీడా పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన హై జంప్ మ్యాట్, మల్టీ డిజిటల్ ప్యానెల్ యూనిట్ లను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ మీట్ సందర్భంగా అథ్లెటిక్ అసోసియేషన్ కోరిన విధంగా, జిల్లాలోని నేషనల్, స్టేట్ మెడలిస్టుల సౌకర్యార్థం ప్రభుత్వ గ్రాంట్ నిధులు 4.95 లక్షలతో హై జంప్ మ్యాట్‌ను మంజూరు చేసినట్లు తెలిపారు. క్రీడాకారులకు ఇప్పటికే యూనిఫామ్స్, షూస్ వంటి కనీస వసతులు కల్పించామని, విద్యాశాఖ అందజేసిన డిజిటల్ ప్యానెల్ యూనిట్ లను ప్రారంభించుకోవడం జరిగిందని వివరించారు. త్వరలోనే స్విమ్మింగ్ పూల్ వద్ద టాయిలెట్స్, కాంపౌండ్ వాల్, అలాగే స్కూల్‌లో గీజర్, పెయింటింగ్ పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు కోరిన విధంగా డైట్ సమస్యను కాంట్రాక్టర్‌తో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తామన్నారు. జిల్లాకు గర్వకారణమైన ఈ స్పోర్ట్స్ స్కూల్ నుండి ఎంతో మంది క్రీడాకారులు మెడల్స్ సాధిస్తున్నారని కొనియాడారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగానే 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ' లాంచ్ కానుందని చెప్తూ.. జిల్లాలో జూడో, రెస్లింగ్, కబడ్డీ మ్యాట్లను సిఎస్ఆర్ నిధుల ద్వారా త్వరలోనే ఏర్పాటు చేసి క్రీడా మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలువురు క్రీడా విద్యార్థుల హై జంప్ ప్రదర్శనను కలెక్టర్ తిలకించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ దయానంద్ రెడ్డి, గిరిజన సంక్షేమ క్రీడల అధికారి పార్థసారథి, కోచ్ లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశాలకు దరఖాస్తులు ప్రారంభం

- **జూలై 31 వరకు అవకాశం**
- **అర్హులైన విద్యార్థులు అవకాశాన్ని**

**వినియోగించుకోవాలి కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి : జులై 9, (తెలంగాణ వాణి ప్రతినిధి)**
జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్ -2027 ద్వారా 2027--28 విద్యా సంవత్సరానికి వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కోరారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు జూలై 31, 2026 చివరి తేదీ అని పేర్కొన్నారు. అభ్యర్థులు **https://navodaya.gov.in** లేదా **http://cbseitms. rcil.gov.in/nvs/** వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షను నవంబర్ 28, 2026న నిర్ణయించిన పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అలాగే విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు విస్తృతంగా ప్రచారం నిర్వహించి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## మీసేవా కేంద్రాల్లోనే యూరియా బుకింగ్

**రైతు ఆశీర్వాద సభకు రైతులు పెద్దఎత్తున తరలిరావాలి: వ్యవసాయ అధికారి**



**అశ్వరావుపేట ఆర్సీ, జూలై 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
స్మార్ట్‌ఫోన్ లేని రైతులు ఇకపై సమీపంలోని మీసేవా కేంద్రాల ద్వారా రూ.10 చెల్లించి యూరియా బుక్ చేసుకునే అవకాశం కల్పించినట్లు మండల వ్యవసాయ అధికారి బి. అరుణ్‌బాబు తెలిపారు. ఫెర్టిలైజర్ యాప్‌ను వినియోగించలేని రైతులకు ఈ సౌకర్యం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అలాగే, లిజూలై 10న మధ్యాహ్నం 2 గంటలకు ఖమ్మం జిల్లా మోత్కే పల్లిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే "రైతు ఆశీర్వాద సభ"లిను ములకలపల్లి, పూసుగూడెం, జగన్నాధపురం రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ అధికారి విజ్ఞప్తి చేశారు.

## పెద్దవాగు ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులను ఆదుకోండి

**మంత్రి తుమ్మలను కోరిన తాటి**



**అశ్వరావుపేట ఆర్సీ జూలై 9 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం పెద్దవాగు ప్రాజెక్ట్ గండిపడడంతో తీవ్రఇబ్బందులుఎదుర్కొంటు న్న ఆయకట్టురైతులనుప్రభుత్వంవెంటనే ఆదుకోవాలని అశ్వారావుపే ట మాజీ ఎమ్మెల్యేబీఆర్ఎస్ పార్టీ రాష్ట్రనాయకులుతాటి వెంకటేశ్వ ర్లురాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావునుకోరారు. దమ్మపేట మండలం గండుగులప ల్లి గ్రామంలోనితననివాసంలో ఆ యన మాట్లాడుతూ, పెద్దవాగు ప్రాజెక్ట్ దెబ్బతినడంతో ఆయక ట్టు రైతులు వరుసగా మూడు పంట సీజన్లుగా తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని ఆవేదన వ్య క్తం చేశారు. తెలంగాణ ముఖ్య మంత్రి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావుచర్చించి, పెద్దవాగు ప్రాజెక్ట్ మరమ్మత్తు ప నులను అత్యవసరంగా చేపట్టే లాచర్యలుతీసుకోవాలని ఆయ న విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, పెద్దవాగు ప్రాజెక్ట్ ఆయకట్టు రై తులతో కలిసి త్వరలోనే ఆంధ్రప్ర దేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబా బు నాయుడును కలిసి రైతులు ఎదుర్కొంటున్నసమస్యలు సాగు నీటి ఇబ్బందులను నేరుగా వివ రించనున్నట్లు తాటి వెంకటేశ్వర్లు తెలిపారు.

# అభివృద్ధితో పాటు ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్, జులై : 09 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
జిల్లాలోని గ్రామాలను అభివృద్ధి తో పాటు ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. స్థానిక రెవెన్యూ గార్డెన్‌లో "గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (విబిజి రామ్ జీ), ఘన వ్యర్థ నియమాలు - 2026" పై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కేవలం ఒక సంవత్సరానికే కాకుండా, ప్రజాప్రతినిధుల పదవీ కాలానికి సరిపడేలా సుదీర్ఘ సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేయాలని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వీబీజీ రామ్ జీ పథకం కింద గత ఉపాధి హామీ కంటే ఎక్కువ మెటీరియల్ పనులకు అవకాశం ఉందని తెలిపారు. పాఠశాలల కొత్త గదులు, ప్రహరీ గోడలు, కిచెన్ షెడ్లు, శౌచాలయాల నిర్మాణం, వాటి మరమ్మతు పనులను ఈ పథకం ద్వారా చేపట్టవచ్చని వివరించారు. గ్రామ




పంచాయతీలు కేవలం ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా సొంతగా ఆదాయంపై సమకూర్చుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే ట్రేడ్ లైసెన్సు, బిల్డింగ్ పర్మిషన్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తద్వారా గ్రామాల్లో మరిన్ని మౌలిక వసతులు కల్పించవచ్చని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నిరంతరం డ్రైనేజీల క్లీనింగ్, వీధుల శుభ్రత చేపట్టాలని, ప్రతి నెల 1, 11, 21 తేదీలలో నీటి ట్యాంకులను తప్పనిసరిగా శుద్ధి చేయాలని స్పష్టం చేశారు. జిల్లాకు నీటి సంరక్షణలో అవార్డు వచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ.. గుట్టల ప్రాంతాల్లో ట్రెంచ్‌లు, పొలాల్లో నీటి కుంటలు, ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా భూగర్భ జలాలను పెంచాలన్నారు. వీటితో పాటు గ్రామాల్లో బాల్యవివాహాల నిర్మూలన, పిల్లలందరినీ బడికి పంపించడం, మత్తు పదార్థాల నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల అమలు వంటి సామాజిక బాధ్యతలపై గ్రామాల్లో తీర్మానాలు చేసి కఠినంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ నరసింహులు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీపీఓ రమేష్, డీఆర్డీఓ రవీందర్, జడ్పీ సీఈఓ రవి, పంచాయతీ రాజ్ ఈఈ శివరాం, గ్రామీణ నీటి సరఫరా ఈఈ చంద్రమోహన్, డిఎల్పిఓలు ఫణిందర్, ప్రభాకర్, జిల్లా, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తును మార్చగలిగే అత్యంత శక్తివంతమైన ఆయుధం చదువే

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**గాదిగూడ, జులై : 09 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
ఆదివాసీ ప్రాంతాల్లో విద్యా వికాసమే సమాజ అభివృద్ధికి బలమైన పునాది అనే లక్ష్యంతో ఆదిలాబాద్ జిల్లా పోలీసు శాఖ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక చొరవతో గాదిగూడ మండలం లోకారి గ్రామంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత, విద్యార్థుల కోసం అధునాతన సదుపాయాలతో కూడిన లైబ్రరీని ఏర్పాటు చేసి గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా ఎస్పీకి ఆదివాసీ పెద్దలు సంప్రదాయ డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం లోకారి గ్రామంలోని కొమరం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి లైబ్రరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, "పేదరికాన్ని, వెనుకబాటుతనాన్ని జయించే గొప్ప ఆయుధం చదువు మాత్రమే. యువత పుస్తకాలతో స్నేహం చేస్తే వారి




భవిష్యత్తు మారుతుంది" అని అన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ లైబ్రరీని వినియోగించుకోవాలని, ముఖ్యంగా యువత ప్రతిరోజూ కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల్లో చదివే అలవాటును పెంపొందించే బాధ్యత తీసుకోవాలని, ప్రతిరోజూ లైబ్రరీకి పంపి విజ్ఞానాన్ని పెంపొందించేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ లైబ్రరీలో యూపీఎస్సీ, గ్రూప్స్, ఎస్ఐ, కానిస్టేబుల్, డీఎస్సీ, టీజీటీ, ఎస్-ఎస్‌బీ, ఆర్ఆర్‌బీ తదితర అన్ని ప్రధాన పోటీ పరీక్షలకు సంబంధించిన 500కు పైగా పుస్తకాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, త్వరలో పోలీసు శాఖలో నిర్వహించనున్న ఉద్యోగ నియామకాల కోసం ప్రత్యేక ఉచిత శిక్షణ కార్యక్రమాలు కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. యువత వాటిని వినియోగించుకుని తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్వీక్ సాయి కొట్టే, నార్నూర్ సీఐ అంజమ్మ, గాదిగూడ ఎస్సై రమ్య, ఆదివాసీ నాయకులు దౌలత్‌రావు తుడసం, అమృతరావు, ఉపాధ్యాయుడు శేఖర్, గ్రామ పెద్దలు, విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏబీవీపీ 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**వనపర్తి : జులై 9, ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
వనపర్తి జిల్లాలోని వివేకానంద చౌరస్తా లో జాతీయ విద్యార్థి దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజాపూర్ కరేంద్రనాథ్, ఎబివిపి పూర్వ రాష్ట్ర అధ్యక్షులు, ప్రస్తుతం రాష్ట్ర కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొని చిత్రపటాలకు పుష్పార్చన చేసి ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజాపూర్ కరేంద్రనాథ్, ఎబివిపి పూర్వ రాష్ట్ర అధ్యక్షులు, ప్రస్తుతం రాష్ట్ర కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు మాట్లాడుతూ దేశ నిర్మాణంలో అఖిల భారత విద్యార్థి పరిషత్ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకుందని 5 మంది విద్యార్థులతో ప్రారంభమై కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అటాక్ నుంచి కటక్ వరకు 78 లక్షల విద్యార్థుల సభ్యత్వం తో ప్రపంచము లోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా నిలిచిందని ఎబివిపి నినాదాలు నేడు దేశానికి విధానాలుగా మారాయిఅని, కాశ్మీర్ ఆర్టికల్ 360 రద్దు కై నినదించి ఉద్యమించి విజయం సాధించిన ఘనత ఎబివిపి దని, అక్రమ వలసదారుల ఏరివేతకు సేవ్ అస్సాం టుడే సేవ్ ఇండియా టుమారో అని అక్రమ వలసదారుల వల్ల ఏర్పడే జాతీయ భద్రత విషయంలో ఎబివిపి చేసిన ఉద్యమాలు నేడు ఈశాన్య రాష్ట్రాలు భారత్ తో బలంగా నిలుచుటకు ఆధారం అయిందని, తెలంగాణ, బెంగాల్, కేరళ, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో వామపక్ష విదేశీ కుట్రలను, నరహంతక నక్సలైట్ల



తూటాలకు ఎదురించి, జాతీయ వాదాన్ని పెంపొందించటానికి భారత్ మాతాకి జై అంటూ అనేక మంది ఎబివిపి కార్యకర్తలు ప్రాణత్యాగాలు సైతం చేశారని, అటువంటి మహా వీరులు పుట్టిన గడ్డ నల్గొండ లో నాడు జాతీయ వాదాన్ని దేశభక్తిని విద్యార్థుల్లో పెంచిన ఏచూరి శ్రీనివాస్ అన్నని నా నివాళ్ళు అర్పిస్తున్నానని అన్నారు, ఏచూరి శ్రీనివాస్ అన్నని చంపి ఈ గడ్డపైన జాతీయవాద దేశ భక్తులు లేకుండా చేసి విదేశీ వామపక్ష భావజాలాన్ని విస్తరించాలని కలలు గన్నా విపక్ష రాడికల్సి నేడు భూతద్దం వెతకాలని అదే ఏచూరి శ్రీనివాస్ అన్నని నమ్మిన జాతీయవాదం ప్రతి విద్యార్థి మదిలో మనసుల్లో విస్తరించిందని అందుకు నేడు ఇక్కడ కాగడా జండా పట్టుకొని భారత్ మాతాకి జై అని నినదిస్తున్న ఈ వేలాదిగా విచ్చేసిన విద్యార్థుల సంఖ్య వారి ఉచ్చాహం సాక్ష్యం అని వామపక్ష వాదుల వ్యక్తి నిర్మూల సిద్ధతం నేడు భారత పటంలో



శాశ్వితంగా నిర్మూలింపబడిందని, జాతీయవాద వ్యక్తి నిర్మాణ సిద్ధాంతం పల్లె పల్లెలో ప్రతి ఇంటిలో విస్తరించిందని అన్నారు, భారత దేశంను ప్రపంచంలోనే విశ్వ గురువుగా నిలుపుటకు ఎబివిపి 78 సంవత్సరాలుగా చేస్తున్న ఈ ప్రయాణంలో ప్రతి విద్యార్థి భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కన్వీనర్ దేవర్ల కార్తీక్, నగర సంయుక్త కార్యదర్శి బంటీ, జ్ఞానేశ్వర్, పవన్, నితిన్,అనిల్,అభినవ్, తేజ, లోకేష్, పరమేష్, సురేష్,జశ్వంత్, వివిధ కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిభావంలో ఒక్కటైన గిరిజన పల్లె:వస్త్రం తండా మరియు రాగ్యా తండాలో శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి సంకల్పం.!

**జనగామ, జూలై 09:(తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఆధునిక సమాజంలో పరుగెడుతున్న కాలంతో పాటు మనుషుల మధ్య బంధాలు,ఐక్యత సడలిపోతున్న ఈ రోజుల్లో.. ఒక మారుమూల గిరిజన తండా మాత్రం సరికొత్త ఆదర్శానికి వేదికై నిలిచింది. భగవంతునిపై ఉన్న అచంచలమైన నమ్మకం, గ్రామస్తుల మధ్య ఉన్న ఐకమత్యం కలిసి ఒక గొప్ప దైవ కార్యానికి శ్రీకారం చుట్టాయి. జనగామ జిల్లా కొడకండ్ల మండలం, మొండ్రాయి గ్రామ శివారులోని వస్త్రం తండా,రాగ్యా తండాలకు చెందిన గిరిజన బిడ్డలు తమలోని దైవభక్తిని చాటుకుంటూ అద్భుతమైన నిర్ణయం తీసుకున్నారు. తండావాసులందరూ ఏకతాటిపైకి వచ్చి, గ్రామానికి రక్షకుడిగా శ్రీ శ్రీ అభయ ఆంజనేయస్వామి వారి ఆలయాన్ని నిర్మించాలని కంకణబద్ధులయ్యారు. భూదానంతో ముందుకు వచ్చిన యువ నాయకుడు ?ఈ గొప్ప సంకల్పానికి పునాది వేస్తూ, ఆలయ నిర్మాణానికి కావలసిన స్థలాన్ని దానం చేయడానికి ప్రముఖ గిరిజన యువ నాయకుడు గుగులోత్ నవీన్ నాయక్ ఉదారంగా ముందుకు వచ్చారు. ఆయన చేసిన ఈ భూదానం తండా చరిత్రలో





నిలిచిపోయేలా ఎంతోమందికి స్ఫూర్తినిస్తోంది. ఆయనతో పాటు తండా అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ తపించే ప్రముఖులు హరిలాల్ నాయక్, వాసు నాయక్, చందర్ నాయక్, సురేష్ నాయక్, కాలురామ్ నాయక్, సోమానీ నాయక్, మల్లు నాయక్, దశరథ నాయక్, వాశీకుడోత్ సోమానీ నాయక్, సుధాకర్ నాయక్, రమేష్ నాయక్, యాకుబ్ నాయక్, చిరంజీవి నాయక్, దేవా నాయక్, కొర్ర బిక్యా నాయక్ మరియు తండా పెద్దలందరి అండదండలు,ప్రోత్సాహంతో అతి త్వరలోనే ఈ ఆలయ నిర్మాణ పనులను ఘనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ?పల్లెల్లో పెరుగుతున్న దైవచింతన ?మారుమూల తండాలలో నివసిస్తున్నప్పటికీ, సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుకుంటూ,దైవకార్యాల కోసం ఇంతలా ముందుకు రావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వస్త్రం తండా ప్రజలు చూపిన ఈ ఐక్యత, భక్తిభావం ఇతర తండాలకు, గ్రామాలకు కూడా ఒక దిక్సూచిలా నిలుస్తుందని స్థానికులు కొనియాడుతున్నారు. ఇలాంటి పవిత్రమైన కార్యక్రమాలు వివిధ గ్రామాల్లో మరిన్ని జరగడం వల్ల సమాజంలో సద్భావన, దైవభక్తి మరింతగా పెంపొందుతాయని ఈ తండావాసులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇట్టి కార్యక్రమానికి ఎల్లవేళలో ముందుండి ప్రోత్సహిస్తున్నటువంటి హరిలాల్ నాయక్ కు గుడి కమిటీ సభ్యులు.ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# బాల్యం నుంచే చదువుపై ఆసక్తి పెంచుకుంటేనే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు

**విద్యార్థులతో కలిసి భోజనం చేసిన జిల్లా ఎస్పీ**

**గాదిగూడ, జులై : 09 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
గాదిగూడ మండలం లోకారి గిరిజన సంక్షేమ బాలికల మినీ గురుకుల పాఠశాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఆదివాసీ ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి విద్య, ఉపాధి, భవిష్యత్ లక్ష్యాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులను ఉద్దేశించి జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, బాల్యం నుంచే చదువుపై ఆసక్తి పెంపొందించుకొని ప్రతిరోజూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, లైబ్రరీలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు అన్ని రంగాల్లో విజయాలు సాధించగలరని తెలిపారు. తల్లిదండ్రులు



తమ పిల్లలను చదువుతో పాటు ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయ తదితర రంగాలపై ప్రోత్సహిస్తూ వారి ప్రతిభను వెలికితీసే దిశగా కృషి చేయాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల విద్యార్థులు అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా ఎస్పీ విద్యార్థులతో కలిసి సామూహిక భోజన కార్యక్రమంలో పాల్గొని వారితో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారి చదువులు, లక్ష్యాలు, భవిష్యత్ ప్రణాళికల గురించి తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు. పాఠశాల విద్యార్థులకు మేధాశక్తిని పెంచే విధంగా చెస్, బిజినెస్, పలు క్రీడా సామాగ్రిని అందజేసి చదువుతోపాటు ఆటలపై ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్వీక్ సాయి కొట్టే , నార్నూర్ సీఐ అంజమ్మ, గాదిగూడ ఎస్సై రమ్య, ఆదివాసీ నాయకులు దౌలత్‌రావు తుడసం, అమృతరావు, దుర్గ పటేల్, ఉపాధ్యాయుడు శేఖర్, విద్యార్థులు పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే

- కేటీఆర్, హరీష్ రావు గుంటనక్కలు
- మళ్లీ బీఆర్ఎస్ లోకి వెళ్లేది లేదు
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- కాంగ్రెస్ తో ఎమ్మెల్యే కూనంనేని అలైబలై



**కొత్తగూడెం, జూలై 9 (తెలంగాణ వాణి)**
సింగరేణి కార్మికుల కష్టాలపై చిత్తశుద్ధి లేని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కాంగ్రెస్ తో అలైబలై చేస్తున్నారని బీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. గురువారం రెండో విడత బాయిబాట కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ రాకముందు సింగరేణిలో 62 వేల మంది కార్మికులు ఉండగా, ఇప్పుడు 38 వేలకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బొగ్గుబావుల్లో పనిచేసే కార్మికులకు సరైన పనిముట్లు కూడా ఇవ్వడం లేదని, వారసత్వ ఉద్యోగాలకు విద్యార్హతలు అడగడం విడ్డూరమన్నారు.బీఆర్ఎస్ ఖాతాలో ఉన్న రూ.1400 కోట్ల అవినీతి సొమ్మును అమరవీరుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పంచాలని ఆమె డిమాండ్ చేశారు.. “నా కంఠంలో ప్రాణం ఉండగా మళ్లీ బీఆర్ఎస్ లోకి వెళ్లేది లేదు. నేను మళ్లీ బీఆర్ఎస్ లోకి వెళ్తానంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు” అని అన్నారు. తమ పార్టీతో భయం లేదంటూనే బీఆర్ఎస్ నాయకులు ఈసీకి వెయ్యికి పైగా ఫిర్యాదులు చేశారని, మీడియా, సోషల్ మీడియాపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. భద్రాద్రి జిల్లాలో ప్రవహించే గోదావరి నీటిని ఖమ్మం జిల్లాకు తరలిస్తూ భద్రాద్రి ప్రజలకు అన్యాయం చేస్తున్నారని, దీనిపై త్వరలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సింగరేణిలో కొత్త గనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20వ తేదీలోపు సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో బొగ్గుగని ప్రాంతంలో నిరాహార దీక్ష చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సింగరేణిలో నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు నిర్వహించాలని కోరారు.“తెలంగాణ ఆడబిడ్డగా ప్రజాసేవ కోసం పార్టీ పెట్టాను. నాపై ఇద్దరు గుంటనక్కలు దుష్ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే. కేటీఆర్, హరీష్ రావు బీఆర్ఎస్ గుంటనక్కలు” అని కవిత ఆరోపించారు. బీఆర్ఎస్ పై కక్షతోనే లక్షలాది మంది రైతులకు కాళేశ్వరం నీరు అందకుండా ప్రభుత్వం అన్యాయం చేస్తోందని విమర్శించారు. సింగరేణి కార్మికుల, ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యే వరకు తెలంగాణ రక్షణ సేన పోరాడుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం పెద్ద సంఖ్యలో చేరిన నాయకులకు, కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా ఇంచార్జి, భద్రాచలం, మణుగూరు, ఇల్లందు నియోజకవర్గ ఇంచార్జిలు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ లోనే టీచర్ల శిక్షణ నిర్వహించాలి.

### పెండింగ్ డీఏలు, పి ఆర్ సి అమలు చేయాలి.

### డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతి రెడ్డి.



**హుస్నాబాద్, జూలై 09(తెలంగాణ వాణి ఆర్ సి)**
ఉపాధ్యాయులకు నిర్వహించే మూడు రోజుల శిక్షణా కార్యక్రమాలను హుస్నాబాద్ డివిజన్ కేంద్రంలోనే నిర్వహించాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. హుస్నాబాద్ లో నిర్వహించిన డీటీఎఫ్ హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండల శాఖల నూతన కమిటీల ఎన్నిక సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించి, పీఆర్సీని అమలు చేయాలని కోరారు. అలాగే ఉపాధ్యాయులపై అదనపు భారం మోపుతున్న మధ్యాహ్న భోజన నిర్వహణ బాధ్యతలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వి. వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ, హుస్నాబాద్ డివిజన్‌కు చెందిన ఉపాధ్యాయులకు నిర్వహించే శిక్షణా కార్యక్రమాల ను సిద్దిపేట, గజ్వేల్‌లలో కాకుండా హుస్నాబాద్‌లోనే నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారులను కోరారు. డివిజన్ కేంద్రంగా ఉన్న హుస్నాబాద్‌ను విస్మరించడం బాధాకరమని, ఇది డివిజన్‌ను చిన్నచూపు చూడడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి సంఘం తరఫున తీసుకెళ్తామని, మంత్రి వెంటనే స్పందించి హుస్నాబాద్‌లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డీటీఎఫ్ మూడు మండలాల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హుస్నాబాద్ మండల అధ్యక్షుడిగా బి. ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డి. సంపత్ రెడ్డి, అక్కన్నపేట మండల అధ్యక్షుడిగా ఈర్య, ప్రధాన కార్యదర్శిగా మల్లయ్య, కోహెడ మండల అధ్యక్షుడిగా ఎ. రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం. సత్తయ్య ఎన్నికైనట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర కౌన్సిలర్ ఎస్. ప్రభాకర్ రెడ్డి, గడ్డం లక్ష్మారెడ్డి, జిల్లా నాయకులు ఇంద్రసేనారెడ్డి, రాజిరెడ్డి, రవీందర్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

### నియామక పత్రం అందజేసిన పార్టీ అధినేత కేసీఆర్

**హైదరాబాద్, జూలై 9 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను పార్టీ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా (రాజ్యసభలో పక్షనేతగా) బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ నియమించారు. ఈ మేరకు గురువారం నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. రాజ్యసభలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఉన్న కే.ఆర్. సురేష్‌రెడ్డి పదవీకాలం ముగియడంతో ఆ స్థానంలో రవిచంద్రకు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆయన రాజ్యసభ సభ్యుడిగా 2030 ఏప్రిల్ వరకు కొనసాగనున్నారు. అలాగే పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం, బొగ్గు–గనుల శాఖ సంప్రదింపుల కమిటీ సభ్యుడిగానూ సేవలందిస్తున్నారు.

**కేసీఆర్, కేటీఆర్‌కు రవిచంద్ర కృతజ్ఞతలు**

పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా నియమించినందుకు బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు రవిచంద్ర కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ తెలంగాణ ప్రజల సమస్యలను పార్లమెంట్‌లో బలంగా వినిపిస్తానని చెప్పారు. పార్టీ బలోపేతానికి, కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్‌ను మరింత బలపర్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

# రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద రైతు ఆశీర్వాద సభకు చింతకాని వేదిక
- 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ
- తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే పంటలపై రైతులు దృష్టి పెట్టాలి
- 150 స్టాల్స్ ఏర్పాటు అంచనాలకు మించి 11 వేల మంది రైతుల హాజరు
- మెగా రైతు మేళాలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు





**చింతకాని, (ఖమ్మం. బ్యూరో) జూలై-09**
(తెలంగాణ వాణి) రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో గురువారం నిర్వహించిన మెగా రైతు మేళాకు రైతులు విశేషంగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మంత్రివర్గం రైతుల అవసరాలు, వ్యవసాయ రంగ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందన్నారు. విత్తనం వేసినప్పటి నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి దశలో రైతులకు ప్రభుత్వం అండగా ఉంటోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమంపై ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తున్నాయని, తమ ప్రభుత్వం మాటలకు పరిమితం కాకుండా చేతల్లో చూపించే ప్రభుత్వమని అన్నారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన నాగార్జున సాగర్, శ్రీరాం సాగర్, కడెం వంటి సాగునీటి ప్రాజెక్టులు నేటికీ రైతులకు నీరందిస్తున్నాయని, గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం కుంగిపోవడం ఆ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో ప్రతి కుటుంబానికి వ్యవసాయంతో అనుబంధం ఉందని, అందుకే ఇక్కడ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. ప్రభుత్వానికి అనేక సమస్యలు ఉన్నప్పటికీ ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేశామని తెలిపారు. వ్యవసాయ ఆధునికీకరణ కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని,ఖమ్మం నుంచి ఆదిలాబాద్ వరకు ప్రతి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును విస్తరిస్తున్నామని తెలిపారు.రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రత్యామ్నాయ పంటలపై శాస్త్రవేత్తలతో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జూలై 10న జరిగే రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి సహా తెలంగాణ మంత్రివర్గం మొత్తం హాజరవుతుందని అన్నారు.ప్రస్తుతం రైతులకు అందుతున్న ప్రతి నీటి చుక్క కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ద్వారానే వస్తోందని తెలిపారు. రైతులను మాయమాటలతో మోసం చేసే పార్టీలకు ప్రజలు అవకాశం ఇవ్వబోరని అన్నారు.రైతు సంక్షేమానికి పునాదులు వేసిన ప్రభుత్వాలను రైతులే కాపాడుకుంటారని, ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్న అబద్ధాలను ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. చింతకాని మండలంలో మూడు లక్షల మంది రైతులతో భారీ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులను రైతులకు అందించాలనే లక్ష్యంతో స్టాల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. రైతుల అభివృద్ధికి అవసరమైన ప్రతి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని, శాస్త్రవేత్తలు చెప్పే అంశాలను రైతులు శ్రద్ధగా విని గ్రామాలకు తీసుకెళ్లాలని కోరారు.ఆధునిక సాగు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయంతో పాటు ఫిషరీస్, హార్టికల్చర్ తదితర అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో జూన్ 30న నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభ వర్షాల కారణంగా జూలై 10వ తేదీకి వాయిదా పడిందన్నారు. తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద రైతు సభను చింతకాని మండలంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవడం లేదని, ఈ ఏడాది నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ఎలా వ్యవసాయం చేయాలనే అంశాలపై వ్యవసాయ శాఖ శాస్త్రీయ సూచనలు అందిస్తోందన్నారు.వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైరా ప్రాజెక్టుకు గోదావరి జలాలు అందించాలని చేసిన విజ్ఞప్తికి డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకాన్ని వినియోగించుకుంటూ రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను వైరా ప్రాజెక్టుకు తరలిస్తున్నామని, దీంతో వర్షాలతో సంబంధం లేకుండా దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు.తక్కువ కాలంలో, తక్కువ నీటితో పండే పంటలను రైతులు సాగు చేయాలని సూచించారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్నను కొనుగోలు చేయలేదని, రైతులు నష్టపోకుండా ఉండేందుకు డిప్యూటీ సీఎం రూ.5 వేల కోట్లు కేటాయించి మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేశారని తెలిపారు. మొక్కజొన్నతో పాటు జొన్న, సోయా తదితర పంటలను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. మొక్కజొన్న విక్రయించిన రైతుల ఖాతాల్లో మద్దతు ధర చెల్లింపులు రేపటిలోగా జమ చేస్తామని స్పష్టం చేశారు. జూలై 10న జరిగే రైతు ఆశీర్వాద సభ చారిత్రక ఘట్టమని, రైతులకు అవసరమైన ప్రతి సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే రైతు ఆశీర్వాద సభకు లక్షలాది మంది రైతులు హాజరై విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.ఉద్యమాలు, పోరాటాలు, వ్యవసాయ రంగంలో ఖమ్మం జిల్లాకు ఘన చరిత్ర ఉందని, జిల్లాలో అత్యధికంగా ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందన్నారు. సంప్రదాయ



పంటలతోపాటు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని, అధిక ఆదాయం వచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు.
సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల ద్వారా వచ్చే వేతనం కంటే ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వం,ప్రకృతి సహకరించక పోయినా రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు.రైతులకు అవసరమైన యూరియాను కేంద్ర ప్రభుత్వంతో చర్చించి సమకూరుస్తున్నామని, యూరియా యాప్ ద్వారా అవసరమైన మేరకే కొనుగోలు చేయాలని సూచించారు.యూరియా యాప్ వల్ల దుర్వినియోగానికి అవకాశం లేకుండా పోయిందన్నారు.రైతులకు వాతావరణ పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని, మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి విత్తనాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రపంచంలో ఉన్న అత్యాధునిక వ్యవసాయ సాంకేతికతను రైతులకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మెగా రైతు మేళా, రైతు ఆశీర్వాద సభ నిర్వహణకు అద్భుతమైన ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం, అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు.వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను రైతులకు వివరించేందుకు ఈ మెగా రైతు మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదర్శ రైతులు అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలను ఇతర రైతులకు పరిచయం చేయడం కూడా ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.పంట మార్పిడి విధానం అమలు చేయడం, ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటల సాగు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.
జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మెగా రైతు మేళా కోసం మొత్తం 150 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖతో పాటు హార్టికల్చర్, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.మెగా రైతు మేళాకు 5 వేల మంది రైతులు వస్తారని అంచనా వేయగా దాదాపు 11 వేల మంది రైతులు హాజరయ్యారని తెలిపారు. రైతుల కోసం ఆధునిక వ్యవసాయ యంత్రాలు, సాంకేతిక పరికరాలను ప్రదర్శనకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు ఎలా సాధించాలి, ఆధునిక సాంకేతికతను వ్యవసాయ రంగంలో ఎలా వినియోగించు కోవాలి అనే అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తారని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాకు విచ్చేయనున్నారని, ‘రైతు ఆశీర్వాదం’ పేరుతో మూడు లక్షల మంది రైతులతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొంటూ, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు...

# రోడ్లపై ఇష్టానుసారంగా టిఫిన్ సెంటర్ల వ్యాపారం

- వాహనదారులకు నిత్యం నరకయాతన
- రోడ్లపై పార్కింగ్ ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయంతో ప్రమాదాలకు ఆహ్వానం
- స్పందించని ట్రాఫిక్ , స్థానిక పోలీసులు, మున్సిపల్ అధికారులు





**వనపర్తి : జూలై 9, ( తెలంగాణ వాణి ప్రతినిధి)**
వనపర్తి జిల్లా కేంద్రంలో రోడ్డు పైనే ఆక్రమణలు ప్రారంభమవడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు. ఎదుర్కొంటున్నారు. హోటల్ యాజమాన్యం రోడ్లపైనే వ్యాపారం నిర్వహిస్తూ, హోటల్కు వచ్చే వాహనాలను కూడా రహదారిపైనే పార్కింగ్ చేయించడంతో ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గతంలో ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టాలు చోటుచేసుకోవడంతో స్పందించిన మున్సిపల్ అధికారులు రహదారులను ఆక్రమించిన చిరు వ్యాపారాలను తొలగించి ప్రజలకు ఊరటనిచ్చారు. అయితే కొద్దిరోజులు గడవకముందే మళ్లీ అదే పరిస్థితి నెలకొనడంతో అధికారుల చర్యలు కేవలం తాత్కాలికంగానే మిగిలిపోయాయన్న విమర్శలు వ్యక్తం మవుతున్నాయి. ప్రస్తుతం హోటల్ యాజమాన్యం రహదారిపైకి వ్యాపారాన్ని విస్తరించడమే కాకుండా, వినియోగదారుల వాహనాలను కూడా రోడ్లపైనే నిలిపివేస్తుండటంతో వచ్చే వాహనాలు ట్రాఫిక్ చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. హోటల్ యాజమాన్యానికి పలుమార్లు సూచనలు వేసినప్పటికీ ఎలాంటి మార్పు కనిపించడం లేదని, సంబంధిత అధికారులు కూడా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత మాత్రమే అధికారులు మేల్కొంటారా? ముందస్తు చర్యలు తీసుకునే బాధ్యత లేదా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, స్థానిక పోలీసు శాఖ వెంటనే స్పందించి రహదారులపై అక్రమ వ్యాపారాలు, అక్రమ పార్కింగ్ పూర్తిగా తొలగించి, ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించాలని జిల్లా ప్రజలు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

# ములుగు జిల్లాలో వివిధ కేసులలో సీజ్ చేయబడిన గంజాయి దగ్ధం

**ములుగు,జులై9 (తెలంగాణ వాణి) :**
ఈగల్ 'ఆదేశాల మేరకు ములుగు జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన ఎన్డీపీఎస్ చట్టం కింద ఉన్న కేసులకు సంబంధించిన భారీ పరిమాణంలోని ఎండు(డ్రై) గంజాయిని ఈరోజు చట్టప్రకారం పూర్తిగా దగ్ధం చేయడం జరిగింది ములుగు జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ సమావేశం నిర్వహించి,గౌరవ న్యాయస్థాన అనుమతితో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న సుమారు రూ. 33.50 లక్షల విలువ గల 67.013 కిలోల పొడి గంజాయిని నిబంధనల ప్రకారం పూర్తిగా నాశనం చేశారు. ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఆదేశాల మేరకు ములుగు డీసీఆర్బీ డీఎస్పీ కిషోర్ కుమార్,మంగపేట ఎస్సై టీవీ సూరి, డీసీఆర్బీ వెంకటేష్ మరియు వారి పోలీస్ బృందం ఆధ్వర్యంలో ఈ మాదక ద్రవ్యాలను నిర్దేశిత వరంగల్ కాకతీయ మెడి వేస్ట్ యూనిట్ లో ప్రత్యేక యంత్రాల ద్వారా పూర్తిగా దగ్ధం చేసి నాశనం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ కిషోర్ కుమార్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్నాథ్ ఆదేశాల ప్రకారం మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వ, మరియు వినియోగంపై జిల్లా పోలీస్ శాఖ అత్యంత కఠినమైన చర్యలు కొనసాగిస్తుందని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును బాగుచేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలో గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా, లేదా విక్రయాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన శిక్షలు మరియు పీడీ యాక్ట్ (గూణ చాష్) నమోదు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.మాదక ద్రవ్యాల సరఫరాకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా



ప్రజలు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచబడతాయని అధికారులు కోరారు.

## పూలే, సాహూజీ, బాబా సాహేబ్ ల త్యాగాల ఫలితమే భారత రాజ్యాంగం

**ఈ నెల 12 వరకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల కమిటీల ను పూర్తి చేయాలి**

**నిషాని రామచంద్రం బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్**



**నిర్మల్:జులై 09 (తెలంగాణ వాణి)**
పూలే,సాహూజీ,బాబా సాహేబ్ ల త్యాగాల ఫలితమే భారత రాజ్యాంగం అని అయితే అది ప్రమాదంలో ఉందన్నారు.రాజ్యాంగ రక్షణ కోసం బహుజన రాజ్యాధి కారం సాధించాలని పిలుపు నిచ్చారు.బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు బెహన్ జీ నేతృత్వంలో ఛీఫ్ సెక్టార్ కోఆర్డినేటర్ గౌరవ్ మాజీ ఎమ్మెల్సీ అతర్ సింగ్ రావ్,సురేష్ ఆర్య ల రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రాం శేఖర్ ల ఆదేశాల మేరకు,రాష్ట్ర కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ ముది రాజ్ ల సూచన మేరకు ఈ నెల 12 తేది వరకు నిర్మల్ జిల్లా లోని జిల్లా కమిటీ తో పాటు అన్ని అసెంబ్లీ నియో జకవర్గాల కమిటీలను పూర్తి చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం అన్నారు.నిర్మల్ జిల్లా సమీక్ష సమావేశంకి ఆయన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యాలయంలో బహుజన్ మహానీయుల చిత్రపటాలకు పూల మాల వేసి నివాళులు అర్పించి జిల్లా కమిటీని సమీక్ష చేశారు,జిల్లాలోని నిర్మల్,ముదోల్,ఖానాపూర్ నియోజకవర్గాలలో అసెంబ్లీ కమిటీలను 12 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. అసెంబ్లీ కమిటీలు వేయాలని పని విభజన చేశారు,మహా నీయుల ఆలోచనన విదానం గూర్చి,రాజ్యాదికార ఆవశ్య కత గూర్చి తెలియజేశారు. కమిటీ ల నిర్మాణం పూర్తయి తేనే బహుజన ఉద్యమం బలోపేతం అవుతుంది అని,ఉద్యమం బలోపేతం అయితేనే బహుజనులకు రాజ్యాధికారం దక్కుతుందని, బహుజనులకు రాజ్యాధి కారం సాదిస్తేనే రాజ్యాంగం రక్షించబడుతుందన్నారు.రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ కేంద్రంలో అధికారం లో ఉన్న బిజెపి పార్టీలు రెండు ఒకే ఆలోచనా విధా నంతో బహుజనుల అభివృ ద్ధికి వ్యతిరేకంగా పని చేస్తు న్నాయి అని అన్నారు. మహాత్మా పూలే,చత్రపతి సాహూజీ మహారాజ్, బాబాసాహేబ్ అంబేద్కర్ ల పోరాటం వలన బహుజనుల బ్రతుకుల్లో వెలుగులు వచ్చా యని.బీఎస్పీ అధినేత్రి బెహన్ జీ మాయావతి నాయకత్వం లో బిసి ఎస్సీ ఎస్టీ మైనారిటీ అగ్రకుల పేదలు బహుజన ఉద్యమం లో మమేకం కావాలని అన్నారు.బీఎస్పీ వల్ల మాత్రమే బహుజనులకు సామాజిక న్యాయం,రాజ్యాధి కారంలో వాటాలు దక్కుతా యన్నారు.ఈ సమీక్ష లో పాల్గొన్న ఛీఫ్ ఇంచార్జ్ అడ్వకేట్ రామచంద్రం జోన్ ఇంచార్జి కల్లెపెల్లి రాజేందర్, పార్లమెంట్ ఇంచార్జ్ తుడిచెర్ల సంజయ్ లకు జిల్లా కమిటీ వారు శాలువా తో సన్మానం చేశారు.ఈ సమీక్ష కి జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ జగన్ మోహన్ అధ్యక్షత వహించగా ఉపాధ్యక్షురాలు ఎస్ కె లక్ష్మి, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ కార్యదర్శి రాజ్యం జిల్లా ఈసి మెంబర్ కాటం ప్రభాకర్, సీనియర్ నాయకులు బీమన్న క్లైమేట్ వెస్లీ, ఖానాపూర్ నియోజకవర్గాల ఇంచార్జ్ జోసెఫ్ గంగారాం, ఉపాధ్యక్షులు గోల్ల భీమన్న, నిర్మల్ నియోజకవర్గం అద్యక్షులు క్యాతం సాగర్, ముదోల్ నియోజకవర్గం నాయకులు చాకటి నిఖీల్, నిర్మల్ పట్టణ నాయకులు అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

## పరారీలో క్రిప్టో స్కీం ప్రధాన నిందితుడు !

, ఆలేరు : క్రిప్టో పెట్టుబడుల పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేసి పరారైన ప్రధాన నిందితుడిని వెంటనే అరెస్టు చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆలేరు పట్టణానికి చెందిన బాధితులు ప్రభుత్వం, పోలీసు అధికారులను కోరుతున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం 2023 ఫిబ్రవరి నెల నుంచి "యూనిటీ మెటా" పేరుతో క్రిప్టో పెట్టుబడులు పెడితే తక్కువ కాలంలో భారీ లాభాలు వస్తాయని హైదరాబాద్ ప్రాంతానికి చెందిన ఎం.డి. గౌస్ అనే వ్యక్తి ఆలేరు ప్రాంతంలో పెద్ద ఎత్తున ప్రచారం చేశాడు. దీంతో ఆయన మాటలు నమ్మిన ఆలేరు పట్టణానికి చెందిన వందలాది మంది ఒక్కొక్కరు రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెట్టుబడుల పేరుతో చెల్లించారు.
ఈ కేసులో ప్రధాన నిందితుడు ఎం.డి. గౌస్ (రామంతపూర్ నివాసి)తో పాటు అతని భార్య వజీద పై ఆలేరు పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. రెండో నిందితురాలు (ఏ-2) వజీదను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, ప్రధాన నిందితుడు (ఏ-1) ఎం.డి. గౌస్ గత కొద్ది రోజులుగా పరారీలో ఉన్నాడు.
ఆలేరు పట్టణంలోనే దాదాపు 500 మంది బాధితుల నుంచి సుమారు రూ.10 కోట్ల వరకు వసూలు చేశాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ సొమ్ముతో ఆలేరు బృందావని కాలనీలో సుమారు రూ.1 కోట్ల విలువైన భవనం, పలు ప్లాట్లు కొనుగోలు చేయడంతో పాటు హైదరాబాద్‌లో కూడా అనేక స్థిరాస్తులు కూడబెట్టుకున్నాడని బాధితులు ఆరోపిస్తున్నారు. ఏప్రిల్ 10, 2026 నుంచి ప్రధాన నిందితుడు పరారీలో ఉండటంతో బాధితులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఫిర్యాదులపై యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసులు కేసు దర్యాప్తును వేగవంతం చేసి, పరారీలో ఉన్న ప్రధాన నిందితుడిని వెంటనే అరెస్టు చేసి, అతని ఆస్తులను అటాచ్ చేసి స్వాధీనం చేసుకుని, మోసపోయిన బాధితులకు వారి సొమ్ము తిరిగి ఇప్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఆర్మూర్ కోర్టుకు హాజరైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

ఆర్మూర్ : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని కోర్టుకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గురువారం హాజరయ్యారు. తీన్మార్ మల్లన్న పై ఆర్మూర్ కోర్టులో నమోదైన కేసుల విచారణ సందర్భంగా మల్లన్న గురువారం ఉదయం పదిన్నర గంటల సమయంలో ఆర్మూర్ కోర్టుకు చేరుకుని జడ్జి ఎదుట విచారణకు హాజరయ్యారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పై నమోదైన కేసుల విషయమై ఆర్మూర్ కోర్టులో ఆర్మూర్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, మాజీ ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్ కుమార్ లు వాదనలు చేశారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పై నమోదైన కేసులను కోర్టులో జడ్జి పరిశీలించి తదుపరి కోర్టులో విచారణకు హాజరు కావలసిన విషయాలను పరిశీలించారు.

## తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీకి 'ఏటీఎం'గా మారింది: జేపీ నడ్డా

: తెలంగాణలో అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ మాజీ అధ్యక్షుడు జేపీ నడ్డా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం (జూలై 9, 2026) తెలంగాణలో పర్యటించిన ఆయన.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అవినీతిమయ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం 'కాళేశ్వరం ప్రాజెక్ట్'ను తమకు ఏటీఎంలా వాడుకుంటే, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ మొత్తం తెలంగాణ రాష్ట్రాన్నే ఢిల్లీలోని తమ హైకమాండ్‌కు 'ఏటీఎం' (రూవీ)గా మార్చేసిందని నడ్డా ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిని పూర్తిగా అటకెక్కించి, నిధులను ఢిల్లీకి తరలిస్తున్నారని ఆయన విమర్శించారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధి చెందాలంటే ఇక్కడ కూడా బీజేపీ ఆధ్వర్యంలో 'డబుల్ ఇంజన్ సర్కార్' రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోఢీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో దేశం అన్ని రంగాల్లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని జేపీ నడ్డా స్పష్టం చేశారు. పేదరిక నిర్మూలన, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొంటూ.. దేశవ్యాప్తంగా సుమారు 80 కోట్ల మంది ప్రజలకు తాము ఉచిత రేషన్ ద్వారా ఆహార భద్రత కల్పిస్తున్నామని గుర్తుచేశారు. ఇందులో భాగంగానే తెలంగాణలో కూడా దాదాపు కోటి 20 లక్షల మంది ప్రజలకు 'ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన' (గ్రావీ+ఖ్) కింద ఉచితంగా బియ్యం, పప్పుధాన్యాలను అందిస్తూ కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని నడ్డా వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# పశ్చిమాసియాలో మళ్లీ రాజుకున్న అగ్గి

- ఇరాన్, అమెరికాల మధ్య పరస్పర దాడులు
- అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ ప్రతిదాడులు
- బహ్రెయిన్, కువైట్‌లపై దాడులు





**టెహ్రాన్, జులై 9** పశ్చిమాసియాలో మళ్లీ అగ్గి రాజుకుంటోంది. పశ్చిమాసియా మరోసారి నిప్పుల కొలిమిగా మారింది. అమెరికా-ఇరాన్ పరస్పర దాడులతో గల్ఫ్ దేశాల్లో సైరన్ల మోత మోగుతోంది. అగ్రరాజ్య దాడులపై తీవ్రంగా మండిపడ్డ టెహ్రాన్.. ప్రతీకార దాడులు మొదలుపెట్టింది. బహ్రెయిన్, కువైట్‌లో అమెరికాకు చెందిన 85 సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు ప్రయోగించింది. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులకు ప్రతిస్పందనగా.. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలపై అమెరికా వైమానిక దాడులు చేసింది. దీనిపై ఐఆర్‌జీసీ తీవ్రంగా స్పందించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని అగ్రరాజ్యం ఉల్లంఘించిందని ఆరోపించింది. దీనికి తాము కూడా ప్రతీకారం తీర్చుకుంటామని, అందుకే ఈ తాజా ఆపరేషన్ చేపట్టినట్లు వెల్లడించింది. బహ్రెయిన్‌లోని యూఎస్ ఫిఫ్త్ ఫ్లీట్, కువైట్‌లోని అలీ అల్ సలేమ్ ఎయిర్ బేస్ సహా అగ్రరాజ్యానికి చెందిన 85 కీలక మిలిటరీ స్థావరాలను టా÷-గ్గ÷ట్ చేసినట్లు పేర్కొంది. వాటిపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించినట్లు తెలిపింది. బుషెహర్‌లో అమెరికా అత్యాధునిక డ్రోన్ ఎంక్యూ-9ను కూల్చినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు జరుగుతోన్న వేళ ఈ ఉద్రిక్తతలు చోటుచేసుకోవడం గమనార్హం. దీనిపై ఐఆర్‌జీసీ స్పందిస్తూ.. తమ చారిత్రక కార్యక్రమాన్ని మరుగున పడేసేందుకు వాషింగ్టన్ ప్రయత్నిస్తోందని దుయ్యబట్టింది. తాజా దాడులపై ఇరాన్ స్పీకర్ ఘాలిబఫ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వేధింపులు, బెదిరింపుల శకం ముగిసింది. ఇక మేం తలొగ్గబోం. అమెరికా తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడుతోంది. ఆ దేశం ఎంత ఒత్తిడి చేసినా.. టెహ్రాన్ లొంగిపోదని రాసుకొచ్చారు. ఇరాన్‌పై ఈసారి అతిపెద్ద దాడి జరిపినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. దాదాపు 80కి పైగా లక్ష్యాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు చేసినట్లు తెలిపింది. టెహ్రాన్ కమాండ్, కంట్రోల్ నెట్‌వర్క్‌లు, కోస్టల్ రాడార్ సైట్లు, యాంటీ షిప్ మిసైల్ సామర్థ్యాలు, గగనతల రక్షణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. ఈ దాడుల్లో ఐఆర్‌జీసీకి చెందిన 60 చిన్న బోట్లు ధ్వంసమైనట్లు వెల్లడించింది. కాగా.. ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నాటో శిఖరాగ్ర సదస్సు కోసం తుర్కియేలో ఉన్నారు. అక్కడి నుంచే ఇరాన్‌పై తాజా దాడులకు ఆయన ఆదేశాలిచ్చినట్లు సమాచారం. మె-ంత్తంగా అమెరికా,ఇరాన్ పరస్పర దాడులతో మళ్లీ ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. ఇరాన్‌పై అమెరికా మరోసారి దాడులు చేసింది. హర్మూజ్ జలసంధిలో మూడు వాణిజ్య నౌకలపై దాడులు జరిగిన గంటల వ్యవధిలోనే ఇరాన్ సైనిక స్థావరాలు, నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలపై విరుచుకుపడింది. ఈమేరకు యుఎస్ సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. అంతర్జాతీయ జలమార్గంలో అమాయక పౌరులు ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై దాడులకు ఇరాన్ మూల్యం చెల్లించుకునేలా.. అమెరికా దళాలు ఈ దాడులు చేపట్టాయని పేర్కొంది. ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, తీరప్రాంత నిఘా వ్యవస్థలు, క్షిపణి నిల్వలు, డ్రోన్‌ల ప్రయోగ స్థావరాలను తమ సేనలు లక్ష్యంగా చేసుకున్నట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు. ఇరాన్ నౌకాశ్రయాల మౌలిక సదుపాయాలపైనా దాడులు చేసినట్లు చెప్పారు. ఖేష్మ్, బందర్ అబ్బాస్‌లలో పేలుళ్ల శబ్దాలు వినిపించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. ఈ దాడులకు ముందే చమురు విక్రయాలకు సంబంధించి ఇరాన్ లైసెన్స్‌ను అమెరికా రద్దు చేసింది. హర్మూజ్‌లో ఇరాన్ చర్యలు ఆమోదయోగ్యం కావని, అందుకే లైసెన్స్‌ను రద్దు చేసినట్లు ఓ అమెరికా అధికారి తెలిపారు. ఈ చర్యను ఇరాన్ విదేశాంగశాఖ తీవ్రంగా ఖండించింది. ఇది తాత్కాలిక ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది. దీని పర్యవసానాలకు అమెరికా ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పింది. ఇకపోతే బహ్రెయిన్, కువైట్‌పై బుధవారం ఇరాన్ దాడులు చేసింది. బహ్రెయిన్‌లో మిస్సైల్ అలర్ట్ సైరన్ మోగించారు. ఇరాన్‌పై మంగళవారం అమెరికా దాడులు చేసిన నేపథ్యంలో.. కౌంటర్‌గా ఇరాన్ అటాక్ చేసింది. అలర్ట్ సైరన్ మోగిన వెంటనే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని బహ్రెయిన్ ప్రకటన చేసింది. బహ్రెయిన్‌లో కానీ, కువైట్‌లో కానీ డ్యామేజ్ అయినట్లు ప్రస్తుతం ఎటువంటి సమాచారం లేదు. తాజాగా హోర్ముజ్ జలసంధిలో మూడు ఆయిల్ ట్యాంకర్లపై ఇరాన్ దాడి చేసింది. ఆ దాడులకు బదులుగా శక్తివంతమైన రీతిలో అమెరికా ప్రతిదాడి చేసింది. సుమారు 80 టార్గెట్లను ధ్వంసం చేశామని, దీంట్లో ఐఆర్జీసీకి చెందిన 60 బోట్లు ఉన్నట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ పేర్కొన్నది. ఖాసిమ్ దీవి, బందర్ అబ్బాస్, సిరిక్ ప్రాంతాలపై దాడులు జరిగినట్లు ఇరానీ మీడియా తెలిపింది. స్థానిక ప్రజలు గాయపడినట్లు తెలిసింది. అయితే హోర్ముజ్‌లో మూడు ట్యాంకర్లపై దాడికి తామే బాధ్యులమని ఇరాన్ ఇప్పటి వరకు ప్రకటించలేదు.

# దేశవ్యాప్తంగా ఎన్ఐఏ భారీ సోదాలు

- ఇస్లామిక్ స్టేట్ ఏర్పాటు కుట్రపై దర్యాప్తు ముమ్మరం
- ఏపీ, తెలంగాణ సహా 10 రాష్ట్రాల్లోని 20 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు
- డిజిటల్ పరికరాలు స్వాధీనం



**ఢిల్లీ, జులై** దేశవ్యాప్తంగా బుధవారం నాడు జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు భారీ ఎత్తున సోదాలు నిర్వహించారు. ఐసీస్, ఏక్యూఐఎస్ ఉగ్రవాద సంస్థల కార్యకలాపాలు, వాటి ప్రచారంపై ఎన్ఐఏ దృష్టి సారించింది. భారతదేశంలో హింసాత్మక జిహాద్ ద్వారా ఇస్లామిక్ స్టేట్ (ఖలీఫత్)ను ఏర్పాటు చేసేందుకు జరుగుతున్న కుట్రపై దర్యాప్తును ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు దేశంలోని మరో 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతమైన ఢిల్లీలోని మొత్తం 20 ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. సోదాల్లో భాగంగా ఉగ్రవాద ప్రచారానికి సంబంధించిన పలు కీలక డిజిటల్ పరికరాలను ఎన్ఐఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని తదుపరి విశ్లేషణ కోసం ఫోరెన్సిక్ పరీక్షలకు పంపనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఉగ్ర కుట్ర కేసుకు సంబంధించి ఇప్పటివరకు 11 మంది నిందితులతో పాటు ఒక మైనర్ బాలుడిని (జువెనైల్) అదుపులోకి తీసుకున్నట్లు ఎన్ఐఏ పేర్కొంది. కాగా, ఈ ఏడాది మార్చి నెలలో విజయవాడ పోలీసులు నమోదు చేసిన ఈ కేసును, తదుపరి సమగ్ర విచారణ నిమిత్తం మే నెలలో ఎన్ఐఏకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రెహ్మాతుల్లా షరీఫ్ మహ్మద్ నివాసంలో గతంలోనే ఐసీస్, ఏక్యూఐఎస్‌లకు సంబంధించిన అభ్యంతరకర ప్రచార సామగ్రి లభ్యమైంది. గతంలో స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాల సాంకేతిక విశ్లేషణ (టెక్నికల్ అనాలసిస్) ఆధారంగానే ఎన్ఐఏ అధికారులు ఈరోజు తాజా సోదాలు నిర్వహించారు. అరెస్టయిన నిందితులు దేశంలోని యువతను జిహాదీ భావజాలం వైపు మళ్లించేందుకు తీవ్రంగా ప్రయత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. విదేశీ హ్యాండ్లర్లతో ఆన్‌లైన్ ద్వారా నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ, సామాజిక మాధ్యమాల వేదికగా ఉగ్ర భావజాలాన్ని వ్యాప్తి చేసినట్లు ఎన్ఐఏ గుర్తించింది. దేశాన్ని అస్థిరపరిచి 'ఖలీఫత్' స్థాపనకు కుట్ర పన్నిన మరికొందరు సూత్రధారులను గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగుతోందని ఎన్ఐఏ అధికారులు స్పష్టం చేశారు.



# బద్రీనాథ్ విరాళాల చోరీ వివాదం

**ఆలయ సిబ్బందిపై వేటు**

**ప్రైవేట్ సెక్రటరీ సస్పెన్షన్, క్రిమినల్ కేసు నమోదు; రంగంలోకి హైలెవల్ కమిటీ**



**డెహ్రాడూన్:** ప్రముఖ పుణ్యక్షేత్రం బద్రీనాథ్ ఆలయ విరాళాల అవకతవకల ఉదంతం కలకలం రేపుతోంది. కానుకల లెక్కింపులో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేయడానికి శ్రీ బద్రీనాథ్ - కేదార్‌నాథ్ టెంపుల్ కమిటీ (దీఖుజ) ఏర్పాటు చేసిన నలుగురు సభ్యుల కమిటీ మంగళవారం నుంచే విచారణ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో, విరాళాల చోరీకి పాల్పడ్డాడన్న ఆరోపణలపై ఆలయ కమిటీ ఒక సిబ్బందిపై తక్షణమే వేటు వేసింది. ఈ వివాదంపై బీకేటీసీ చైర్మన్ హేమంత్ ద్వివేది స్పందిస్తూ.. ఆలయంలో ప్రైవేట్ సెక్రటరీగా పనిచేస్తున్న ప్రమోద్ నౌతియాల్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. ప్రాథమిక విచారణలోనే విరాళాల విషయంలో అతడు తీవ్ర అక్రమాలకు పాల్పడినట్లు తేలిందని ఆయన పేర్కొన్నారు. కాగా, సస్పెన్షన్‌కు గురైన ప్రమోద్ నౌతియాల్‌పై మంగళవారం రాత్రి బద్రీనాథ్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ ఎఫ్ఐఆర్ నమోదైంది. భారతీయ న్యాయ సంహిత (దీచీూ) సెక్షన్ 306, 316(5) కింద పోలీసులు అతనిపై కేసులు నమోదు చేశారు. ఆలయ విరాళాల వివాదం తీవ్రరూపం దాల్చడంతో ఉత్తరాఖండ్ ప్రభుత్వం కూడా ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ ఆదేశాల మేరకు ముగ్గురు సభ్యులతో కూడిన హై-లెవల్ కమిటీ ఏర్పాటైంది. గర్వాల్ డివిజనల్ కమిషనర్ ఆనంద్ స్వరూప్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తుండగా.. నేషనల్ హెల్త్ మిషన్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ తివారీ, మెడికల్ హెల్త్ సర్వీసెస్ ఫైనాన్స్ డైరెక్టర్ జగత్ సింగ్ చౌహాన్ ఇందులో సభ్యులుగా ఉన్నారు. బద్రీనాథ్ ఆలయ విరాళాలు, భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపులో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, 15 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి ఈ కమిటీని ఆదేశించారు.

# పూణెలో కుప్పకూలిన మూడంతస్థుల భవనం

**ముంబై, జూలై** : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు మహారాష్ట్రను అతలాకుతలం చేస్తున్నాయి. పలు జిల్లాల్లో కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఇదే సమయంలో పుణెలిలో కూడా భారీ వర్షాల కారణంగా ఓ మూడంతస్తుల భవనం కుప్పకూలి తీవ్ర కలకలం రేపింది. మోషి ప్రాంతంలోని పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్‌లోని మూడు అంతస్తుల కార్యాలయ భవనం ఒక్కసారిగా నేలమట్టమైంది. అధికారుల సమాచారం ప్రకారం, భవనం కూలిన సమయంలో అందులో ఉన్న 15 నుంచి 16 మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని ఉండే అవకాశం ఉంది. మధ్యాహ్నం సుమారు 1.45 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఘటనపై వెంటనే సమాచారం అందుకున్న పీసీఎంసీ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాలింపు, సహాయక చర్యల కోసం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను కూడా రంగంలోకి దించారు.



## యష్, కియారా అద్వానీ క్రేజీ రొమాన్స్.. టాక్సిక్ నుంచి 'తబాహి' వీడియో సాంగ్ విడుదల

రాకింగ్ స్టార్ యష్ హీరోగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టాక్సిక్' సినిమా నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాలోని మొదటి సింగిల్ 'తబాహి' వీడియో సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ వీడియోలో యాష్, కియారా అద్వానీల మధ్య ఉన్న హాట్ కెమిస్ట్రీ స్క్రీన్‌పై మ్యాజిక్ క్రియేట్ చేసింది. ప్రతి ఫ్రేమ్‌లోనూ వీరిద్దరి లవ్ అండ్ ఇంటెన్సిటీ ప్రేక్షకులను కట్టిపడేస్తోంది. పాట యావరేజ్‌గా ఉన్నప్పటికీ, విజువల్స్ మాత్రం సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేశాయి. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత, అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, అమిత్ తివారీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రవి బస్రూర్, తనిష్క్ బాగ్చీ, ఫహీమ్ అబ్దుల్లా తదితరులు సంగీతం అందిస్తుండగా, ఈ తెలుగు వర్షన్ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ, యష్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 2026 ఆగష్టు 26న ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.




## 22 ఏళ్ల తర్వాత నటుడిగా థమన్.. ఆసక్తికరంగా 'హృదయం మురళి' ట్రైలర్




కోలీవుడ్ యంగ్ హీరో అథర్వ మురళి, మలయాళ స్టార్ యాక్టర్ ఫహద్ ఫాజిల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'హృదయం మురళి' ఆకాష్ భాస్కరన్ దర్శకత్వంలో యూత్ ఫుల్ ఎమోషనల్ అండ్ రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా ట్రైలర్ తాజాగా విడుదలైంది. ఒక యువకుడి జీవితంలో ఎదురయ్యే వన్-సైడెడ్ లవ్, భావోద్వేగాల చుట్టూ ఈ కథ తిరుగుతుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. జీవితం ముందుకు సాగుతున్నా కొన్ని జ్ఞాపకాలు, భావాలు ఎప్పటికీ చెరిగిపోవనే పాయింట్ తో ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు మేకర్స్. ఇక ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్, కాయదు లోహర్ కథానాయికలుగా నటిస్తుండగా, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ ఎస్ దాదాపు 22 ఏళ్ల తర్వాత మళ్లీ నటుడిగా మెరవబోతుండటం విశేషం. అంతేకాకుండా ఈ సినిమాకు థమన్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ చిత్రంలో ఫహద్ ఫాజిల్ ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను తెలుగులో అందిస్తుండగా, జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రస్తుతం విడుదలైన ఈ ట్రైలర్ యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.

## అతడు స్టార్ నటుడు అనుకోలేదు.. మహేష్ బాబు క్రేజ్‌పై కృతి సనన్ కామెంట్స్!



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుకి ఉన్న క్రేజ్ ఎలాంటిదో బాలీవుడ్ స్టార్ బ్యూటీ కృతి సనన్ తాజాగా ఒక ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన సైకలాజికల్ థ్రిల్లర్ '1: నేనొక్కడినే' (2014) సినిమాతోనే కృతి సనన్ వెండితెరకు పరిచయమైన సంగతి తెలిసిందే. ఈ డెబ్యూ మూవీ జ్ఞాపకాలను పంచుకుంటూ, సినిమా ఒప్పుకునే సమయానికి తనకు తెలుగు సినిమాలపై గానీ, మహేష్ బాబు రేంజ్ ఏంటో గానీ పెద్దగా అవగాహన లేదని ఆమె చెప్పారు. తాను హిందీ సినిమాలు చూస్తూ పెరగడం వల్ల మొదట్లో మహేష్ బాబుని కలిసినప్పుడు ఒక నార్మల్ సీనియర్ నటుడిలా చాలా క్యాజువల్‌గా కలిశానని, ఆయనకున్న క్రేజ్ ఏంటో తనకు అప్పుడు తెలియదని అన్నారు. కానీ, ఎప్పుడైతే తాను '1: నేనొక్కడినే' షూటింగ్ సెట్స్‌లోకి అడుగుపెట్టానో, ఆ తర్వాత జరిగిన భారీ ఆడియో లాంచ్ ఈవెంట్‌ను కళ్లారా చూశానో... అప్పుడు సూపర్ స్టార్ మహేష్ బాబు రేంజ్, ఆయనకున్న స్టార్‌డమ్, అబిమానుల్లో ఉన్న విపరీతమైన క్రేజ్ ఏంటో తనకు పూర్తిగా అర్థమైందని కృతి సనన్ వివరించారు. నటనలో ఎలాంటి ముందస్తు శిక్షణ లేకపోయినా డైరెక్టర్ సుకుమార్ తనను నమ్మి ఈ సినిమాలో హీరోయిన్ ఛాన్స్ ఇచ్చారని, షూటింగ్ లోకేషన్స్ కి వచ్చే జనాల్ని, ముఖ్యంగా థియేటర్లలో జరిగిన ఆడియో ఫంక్షన్‌కు వచ్చిన ఊహించని రద్దీని చూసి తాను షాక్ అయ్యానని ఈ బాలీవుడ్ భామ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 2014 జనవరిలో విడుదలైన ఈ సినిమా పరాజయం పాలవ్వగా.. ప్రస్తుతం బాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న కృతి సనన్, తన కెరీర్ టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుతో ప్రారంభం కావడం ఎప్పటికీ స్పెషల్ అని సంతోషం వ్యక్తం చేశారు.

## రూ.100 కోట్ల బడ్జెట్.. రూ.15 కోట్ల కలెక్షన్లు బాక్సాఫీస్ వద్ద కొట్టుమిట్టాడుతున్న 'నాగబంధం'.. వర్కవుట్ కాని 'సనాతన కార్డ్'!



టాలీవుడ్‌లో సనాతన ధర్మం, పురాతన ఆలయాల రహస్యాల నేపథ్యంలో తెరకెక్కిన తాజా సోషియో ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' బాక్సాఫీస్ వద్ద తీవ్రంగా కొట్టుమిట్టాడుతోంది. సుమారు రూ. 100 కోట్ల భారీ బడ్జెట్‌తో, విరాట్ కర్ణ, నభా నటేష్, ఐశ్వర్య మీనన్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు అభిషేక్ నామా రూపొందించిన ఈ పాన్-ఇండియా చిత్రం జూలై 3న విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో పూర్తిగా విఫలమైంది. ఇటీవలి కాలంలో భక్తి, సనాతన ధర్మం బ్యాక్‌డ్రాప్‌తో వచ్చిన సినిమాలు ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోతున్న సంగతి తెలిసిందే. మేకర్స్ ఎంత సనాతనం కార్డు వాడిన సినిమాలో మ్యాటర్ లేకపోతే ప్రేక్షకుల ఆ వైపు కూడా చూడాట్లేదు. అయితే తాజాగా ఈ సినిమా కూడా అలాగే 'సనాతన కార్డ్'తో రాగా.. బలహీనమైన కథనం, దర్శకత్వ లోపాలు, ఎక్కువ నిడివి కారణంగా థియేటర్లలో అస్సలు వర్కవుట్ కాలేదు. సినిమాపై భారీ బడ్జెట్ పెట్టినప్పటికీ.. థియేటర్లలో మాత్రం ఈ సినిమా వసూళ్లు అత్యంత ఘోరంగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2100 స్క్రీన్లలో విడుదలైన ఈ చిత్రం, మొదటి మూడు రోజుల్లో (వీకెండ్) కలిపి ఇండియా నెట్ కలెక్షన్ల పరంగా కేవలం రూ. 9.75 కోట్లు మాత్రమే రాబట్టింది. ఇక గ్రాస్ వసూళ్లు, ఓవర్సీస్ కలెక్షన్లు అన్నీ కలిపినా మొదటి వీకెండ్ ముగిసేసరికి వరల్డ్‌వైడ్ కలెక్షన్లు రూ. 13.70 కోట్ల నుండి రూ. 15 కోట్ల లోపే పరిమితమయ్యాయి. సినిమా రన్‌టైమ్ ఎక్కువ ఉందని దాదాపు 20 నిమిషాలు తగ్గించిన కూడా ఆశించిన స్థాయిలో సినిమా లేకపోవడంతో ప్రేక్షకులు ఈ అడ్వెంచర్ రైడ్‌ను తిరస్కరిస్తున్నారు. జగపతి బాబు, అనసూయ భరద్వాజ్ వంటి భారీ తారాగణం ఉన్నప్పటికీ, బాక్సాఫీస్ వద్ద 'నాగబంధం' గట్టెక్కడం కష్టంగానే కనిపిస్తోంది.



## రవితేజ -- శ్రీ విష్ణు మల్టీస్టారర్‌కు క్రేజీ టైటిల్.. సంక్రాంతి బరిలో నవ్వుల జాతర!



టాలీవుడ్‌లో మరో ఇంట్రెస్టింగ్ మల్టీస్టారర్‌కు రంగం సిద్ధమవుతోంది. మాస్ మహారాజా రవితేజతో పాటు తన కామెడీ టైమింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీ విష్ణు తొలిసారి ఒకే సినిమాలో నటించనున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రానికి 'వీరాధి వీరులంట' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, ఈ టైటిల్ ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా కథ, కామెడీ టోన్‌కు తగ్గట్టుగానే ఈ టైటిల్ ఉంటుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. వీశీజఱవం ఈ చిత్రానికి హసిత్ గోలి దర్శకత్వం వహించనున్నారు. ఇప్పటికే శ్రీ విష్ణుతో 'రాజా రాజా చోర', 'స్వాగ్' వంటి చిత్రాలను తెరకెక్కించిన హసిత్ గోలి.. ఇప్పుడు రవితేజతో కలిసి మరో వినోదభరితమైన కథను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. దీంతో శ్రీ విష్ణు-హసిత్ గోలి కాంబినేషన్‌లో ఇది హ్యాట్రిక్ మూవీ కానుంది. పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొంద నున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ నిర్మాత దిల్ రాజు, ఆయన సోదరుడు శిరీష్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని సమాచారం. షూటింగ్‌ను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించేలా చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. అలాగే సినిమాను 2027 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో ప్లానింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. రవితేజ ఎనర్జీ, కామెడీ టైమింగ్‌కు.. శ్రీ విష్ణు సహజమైన హాస్యం తోడైతే ఈ సినిమా వినోదానికి కొత్త నిర్వచనం ఇవ్వడం ఖాయమనే అభిప్రాయం అభిమానుల్లో వ్యక్తమవుతోంది. షూటింగ్ ప్రారంభం కాకముందే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొనడం విశేషం. అయితే సినిమా టైటిల్, విడుదల తేదీతో పాటు నటీనటుల పూర్తి వివరాలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అప్పటి వరకు 'వీరాధి వీరులంట' అనే టైటిల్‌తో ఈ క్రేజీ మల్టీస్టారర్ వార్తలు టాలీవుడ్‌లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com